RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 15 | సంచిక: 381 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | శుక్రవారం 17-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY తెలుగు దినపత్రిక The Voice of Telangana R N I No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## తెలంగాణను పాకిస్తాన్ లా విడదీశారు!

**- లోక్ సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ షాకింగ్**



**న్యూఢిల్లీ** లోక్‌సభ, అసెంబ్లీనియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్లమెంట్‌లో చర్చసందర్భంగా విపక్షాల ఆరోపణలను అధికార బీజేపీ తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై బీజేపీ యువ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఏర్పాటును ఆయన పాకిస్థాన్ విభజనతో పోల్చారు. ఏపీ విభజనను బ్రిటిషర్ల కంటే దారుణంగా చేసిందని ఆరోపించారు. విభజన సమయంలో తెలుగు ప్రజల భావోద్వేగాలు, ఆర్థిక వనరులను కాంగ్రెస్ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఆ పాపం ఇప్పటికీ ఆ పార్టీని వెంటాడుతూనే ఉందని ఆయన విమర్శించారు. విభజన గాయాల నుంచి ఇప్పటికీ ఏపీ కోలుకోలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరిగిన అన్యాయానికి కాంగ్రెసే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

2లో..

## తేజస్వీసూర్యపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫైర్

**- తెలంగాణను అవమానించారని ఆగ్రహం**

**హైదరాబాద్** లోక్‌సభ వేదికగా నియోజకవర్గాల పునర్విభజన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చిచ్చు రేపాయి. తెలంగాణ ఏర్పాటు, విభజన ప్రక్రియపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ముక్తకంఠంతో ఖండించాయి. లోక్‌సభలో ప్రసంగిస్తూ తేజస్వీ సూర్య.. ఆంధ్రప్రదేశ్ విభజనను బ్రిటిష్ వారు దేశాన్ని విడగొట్టిన తీరుతో పోల్చారు. కాంగ్రెస్ పార్టీ అత్యంత అశాస్త్రీయంగా, ఘోరంగా రాష్ట్రాన్ని చీల్చిందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను తక్కువ చేసేలా ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఉన్నాయని తెలంగాణ నేతలు మండిపడుతున్నారు.

2లో..



# మద్దతు ఇవ్వకుంటే మనుగడ ఉండదు

**- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం**



- **మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌లో వివక్ష ఉండదని ప్రధాని హామీ**
- **ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా న్యాయం చేస్తామని ప్రకటన**
- **ఈ అంశంపై రాజకీయం చేయవద్దని విపక్షాలకు సూచన**
- **మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ మీరే తీసుకోవచ్చని విపక్షాలకు ఆఫర్**
- **2029 నాటికి కోటాను అమలు చేయకపోతే మహిళలను ఒప్పించలేమని వ్యాఖ్య**

న్యూఢిల్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రధాని మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే శక్తులను దేశంలోని మహిళలు ఎన్నటికీ క్షమించరని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఎవరైతే ఈ బిల్లును అడ్డుకుంటారో, వారు సుదీర్ఘకాలం పాటు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని ఆయన హెచ్చరించారు. గతంలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే ఏ విషయంలోనైనా అడ్డుపడిన ఏ ఒక్కరినీ మహిళలు వదిలిపెట్టలేదని ఆయన గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లు అనేది ప్రభుత్వం ఇచ్చే బహుమతి కాదని, అది వారి హక్కు అని ఆ స్పష్టం చేశారు. సుమారు 25-30 ఏళ్ల క్రితమే ఈ ఆలోచన వచ్చినా, అమలులో జరిగిన ఆలస్యాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఆనాడే దీనిని అమలు చేసి ఉంటే బాగుండేదని, అయితే ఇప్పుడు దీనిని ఒక పరిణతి చెందిన దశకు తీసుకువచ్చామని చెప్పారు. దశాబ్దాలుగా మహిళలకు దక్కాల్సిన ఈ గౌరవాన్ని ఆలస్యం చేసినందుకు, ఇప్పుడు దీనిని ఆమోదించడం ద్వారా ఆ తప్పులను సరిదిద్దుకునే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం మదర్ ఆఫ్ డెమోక్రసీ అని ప్రధాని అభివర్ణించారు. కాలక్రమేణా అవసరాలకు అనుగుణంగా చట్టాలను మెరుగుపరచుకోవడమే ప్రజాస్వామ్య సౌందర్యమని ఆయన చెప్పారు. వేల ఏళ్ల మన ప్రజాస్వామ్య ప్రయాణంలో, సగం జనాభాకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా

2లో..

## తేజస్వీ మాటల్లో అంతరార్థం వేరే ఉంది

**- తేజస్వీసూర్య వ్యాఖ్యలపై రామచందర్ రావు క్లారిటీ**



హైదరాబాద్ నియోజకవర్గాల పునర్విభజనపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణలో తీవ్ర ఆందోళనలకు కారణం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ విభజనను భారత్, పాక్ దేశాల విభజనతో పోల్చుతూ తెలంగాణను తీవ్రంగా అవమానించారంటూ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తాజాగా తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై అర్థం పర్థం లేకుండా బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు.కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు బీఆర్ఎస్ నేతలు తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై ప్రవర్తిస్తున్నారని రామచందర్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎంపీ తేజస్వీ మాట్లాడిన మాటల్లో ఉన్న అంతరార్థం వేరని బీఆర్ఎస్ నేతలు వాటిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. తేజస్వీ సూర్య మాటలను భూతద్దంలో పెట్టి చూడొద్దని రామచందర్ రావు హితవు పలికారు. తెలంగాణను పాకిస్తాన్‌తో తేజస్వీ సూర్య పోల్చలేదని స్పష్టం చేశారు. ఇక తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి జరిగిన పోరాటం సందర్భంగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)లో బీజేపీ కూడా భాగంగా ఉందని రామచందర్ రావు గుర్తు చేశారు. బీజేపీ లేకపోయి ఉంటే తెలంగాణ వచ్చేదా అని నిలదీశారు. తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి లోక్‌సభలో జరిగిన చర్చ సమయంలో బీఆర్ఎస్ ఇద్దరు సభ్యులు లేరని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పార్టీ యూటర్న్ తీసుకుందని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గడంతో చాలా మంది తెలంగాణ కోసం పోరాటం చేసిన వారు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. వారి ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా అని ప్రశ్నించారు. వాజ్‌పేయి చాలా సాఫీగా ఒక్క రక్తం చుక్క కూడా పడకుండా 2001లో 3 రాష్ట్రాలను ఇచ్చారని రామచందర్ రావు గుర్తు చేశారు.

## 'సన్'చలన అలర్ట్

**- తెలంగాణలో మూడు రోజులు జాగ్రత్త!**



హైదరాబాద్ గత మూడు నాలుగు రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ఉష్ణోగ్రతలను అసాధారణ స్థాయికి తీసుకెళు న్నాడు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు అదనంగా నమోదు అవుతున్నాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన వాతావరణ శాఖ రాష్ట్రంలోని దాదాపు 20 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.సాధారణం కంటే 1.5 నుంచి 4.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగడమే ఈ హెచ్చరికకు ప్రధాన కారణం. కేవలం పగలు మాత్రమే కాదు, రాత్రి సమయాల్లో కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల వంటి జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి.ఈ ఎండలు తీవ్ర ఎంతలా ఉంటుందంటే

2లో..

## ఇరాన్‌కు మరోసారి అమెరికా వార్నింగ్

**- ఒప్పందం కుదరకపోతే ఇంధన వనరులే టార్గెట్!**



న్యూయార్క్ అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌పై కఠినమైన నావికాదళ దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నామని, తెలివిగా నిర్ణయం తీసుకోవాలని గురువారం అమెరికా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే సైనిక చర్యను మరింత తీవ్రతరం చేయడానికి తమ బలగాలు 'లాక్ అండ్ లోడ్'తో సిద్ధంగా ఉన్నాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కమాండర్ అడ్మిరల్ బ్రాడ్లీ కూపర్ కూడా పాల్గొన్నారు.'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా పిలుస్తున్న సైనిక చర్య తర్వాత ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే అమెరికా ఈ హెచ్చరికలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతంపై దిగ్బంధనం ఇప్పటికే అమల్లో ఉందని, దీన్ని నిరవధికంగా కొనసాగించగలమని హెగ్సెత్ తెలిపారు. "మీ ఇంధనం కదలడం లేదు, ఇకపై కదలదు కూడా. ఇది మర్యాదపూర్వకంగా జరిగే విధానం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఏ దేశానికి చెందిన నౌక అయినా ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించకుండా ఈ దిగ్బంధనం వర్తిస్తుందని, ఇప్పటికే 13 నౌకలను వెనక్కి పంపినట్లు అధికారులు వెల్లడించారు.

దౌత్యపరమైన పరిష్కారాన్నే తాము కోరుకుంటున్నామని, కానీ చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెగ్సెత్ హెచ్చరించారు. "మేం మంచి మార్గాన్నే ఇష్టపడతాం కానీ మీరు చెడు మార్గాన్ని ఎంచుకుంటే, మీ ఇంధన పరిశ్రమతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలే మా లక్ష్యం. మా అధ్యక్షుడి ఆదేశాలతో, ఒక్క బటన్ నొక్కితే చాలు మేము దాడికి సిద్ధం" అని ఆయన స్పష్టం చేశారు. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తమ సైన్యం పూర్తి సంసిద్ధతతో ఉందని,

2లో..

## తెలంగాణ కులగణన తుది రిపోర్ట్

**- అతిపెద్ద సామాజిక వర్గంగా మాదిగలు - ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీలు టాప్**



హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ మరియు కుల సర్వేను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. కుల గణను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసిన రాష్ట్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా అత్యంత పారదర్శకమైన పద్ధతుల్లో ఈ కుల గణన ప్రక్రియను పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. సమాజంలో సమానత్వం సాధించడానికి కులగణన వంటి కీలక నిర్ణయాలు అవసరమని ఈ క్రమంలో ఈ నివేదిక ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది అని ప్రభుత్వం పేర్కొంది.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వేను కేంద్రప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి అని మందబాలంతో కాకుండా శాస్త్రీయంగా జనగణన చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక,ఆర్థిక, విద్య, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా మొత్తం కోటి 12 లక్షల 36 వేల 849 కుటుంబాలను సందర్శించి సర్వే చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. అంటే దాదాపు 97.10 శాతం సర్వేను పూర్తి చేసినట్లు తెలిపింది.ఈ చారిత్రాత్మక సర్వేలో ఒక లక్షా మూడు వేల మంది ప్రభుత్వ సిబ్బందిని భాగస్వాములను చేసి, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో సమాచారాన్ని సేకరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ సర్వే ద్వారా మొత్తం 3 కోట్ల 55 లక్షల 50 వేల 759 మంది జనాభా వివరాలను పకడ్బందీగా క్రోడీకరించారు. తాము సేకరించిన ఈ ప్రామాణికమైన డేటాను పబ్లిక్ డొమైన్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వం తెలిపింది.

2లో..

## ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

**అంతర్జాతీయ సంస్థలకు ప్రధాని మోదీ సూచన**



న్యూఢిల్లీ అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

2లో..

తెలంగాణ వాణి
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026

# పకడ్బందీగా ప్రజా పాలన : ప్రగతి ప్రణాళిక అమలు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక మండల సభ ఇల్లంతకుంటలో నిర్వహణ
- అంగన్వాడీలకు ఆక్వా గార్డ్ యంత్రాల పంపిణీ
- దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత
- ఆకట్టుకున్న వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లు



**రాజన్న సిరిసిల్ల** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్వహించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం మండల సభ నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు, రైతులు ప్రజలు వేదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతంతో ప్రారంభించారు.అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. అరైవ్.. అలైవ్ కింద ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేశారు. 11,756 మందికి ఇందిరమ్మ చీరలు......రైతు భరోసా లబ్ధిదారులు మొత్తం 17,883 మందికి, రైతు రుణ మాఫీ 5,745 మందికి, మొత్తం 593 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 185 మంది ఇండ్లు పూర్తి అయ్యాయని 408 ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని ఎంపీడీఓ శశికళ తెలిపారు. మహాలక్ష్మి కింద 8,985 మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 9,572 కుటుంబాలకు అందుతుందని 77 మందికి సన్నరకం వరి బోనస్ అందించిన వివరించారు. చేయూత పెన్షన్స్ 7,915 మందికి అందుతుందని, మండలంలో నూతనంగా 1,974 మందికి తెల్లరేషన్ కార్డులు పొందారని తెలిపారు. 771 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పంపిణీ చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ మహిళా శక్తి కింద 50 శాతం బ్యాంక్ లింకేజీ రుణాలు, ఇందిరమ్మ చీరలు 11,756 మందికి చీరలు పంపిణీ చేశామని ఎంపీడీఓ శశికళ వెల్లడించారు.ఇందిరమ్మ ఇండ్ల పూర్తిలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా మొత్తంలో నూతన రేషన్ కార్డులు 23,131 మంజూరు చేశామని, రూ. 500కే ఇప్పటిదాకా 3,91,247 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటిదాకా 1,648 ఇండ్లు పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన జాబితాలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే 1,25,855 మందికి రైతు భరోసా అందిందని, 46,492 మందికి రుణమాఫీ అయిందని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి వెళ్లింది మొదలు ఇంటికి వచ్చే వరకూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య పనులు చేయించామని వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు

.ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని 42 గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు ఎప్పుడైనా యుద్ధాలు, రోగాలతో ఎక్కువ మంది చనిపోతారని అందరూ భావిస్తారని, కానీ గత ఏడాది దేశంలో గత ఏడాది 4,70,000 ప్రమాదాలు జరిగాయని 1,70,000 మంది మృతి చెందారని గుర్తు చేశారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువ సంఖ్యలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని వెల్లడించారు.గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలి నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమాన్ని గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అందరి రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తండ్రికి హెల్మెట్ ఉపయోగం చెప్పాలని పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన వీఓఏ భవనాలు జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు త్వరలో బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా అమలు చేయనున్నదని వెల్లడించారు. రైతులు వరితో పాటుగా ఆయిల్ పామ్ సాగు చేయాలని, దీంతో మంచి దిగుబడి, మద్దతు ధర వస్తునద్నని, రైతులకు సబ్సిడీ పై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వివరించారు.

### పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలిపే స్టాళ్లు

వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్, పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్, నానో యూరియా విశేషాలు వెల్లడిస్తూ.. స్రీ శిశు సంక్షేమ శాఖ పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలియజేస్తూ.. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్త్రాలు, ఆహార పదార్థాల స్టాళ్లను పరిశీలించి.. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్ మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ తహసిల్దార్ సురేష్ ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో సెన్సస్ ఆపరేషన్స్‌కు పూర్తి స్థాయి సిద్ధత

- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- జిల్లా మొత్తం 42 చార్జ్‌లుగా విభజించి సమగ్ర వ్యవస్థ ఏర్పాటు
- సిబ్బందికి బహుళ దశల్లో శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి
- 100% ఆన్‌లైన్ సెన్సస్ విధానం, మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ
- మొదటిసారిగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (ఏప్రిల్ 1630) అమలు
- ప్రజలకు సులభమైన విధానం ద్వారా నమోదు అవకాశం:
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి** జిల్లాలో జరగబోయే 2026 -2027 సెన్సస్ ఆపరేషన్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక జిలా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు 2026 -2027 సెన్సస్ కార్యక్రమంపై డీ ఆర్ ఓ నరసింహులు, మీడియా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 2026-27 సెన్సస్ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర స్థాయిలో సెన్సస్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహత్తర కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు చార్జ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారన్నారు. జిల్లాను మొత్తం 42 చార్జ్‌లుగా విభజించినట్లు, ఇందులో 36 మండలాలు, 5 మున్సిపాలిటీలు మరియు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఒక ప్రత్యేక చార్జ్‌గా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి చార్జ్‌ను హౌస్ లిస్టింగ్ బ్లాక్స్‌గా విభజించి, ప్రతి బ్లాక్‌కు ఎన్యూమరేటర్లు, వారి పర్యవేక్షణకు సూపర్వైజర్లు నియమించబడినట్లు తెలిపారు. సెన్సస్ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా, జిల్లాలో చార్జ్ ఆఫీసర్లకు మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ, హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు చెప్పారు. అదనంగా మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు గుర్తించి, ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు దశల వారీగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుండి ఎన్యూమరేటర్లకు తుది దశ శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈసారి సెన్సస్ ప్రత్యేకతగా 100% ఆన్‌లైన్ విధానంలో నిర్వహించడం ముఖ్యాంశమని తెలిపారు. ఎన్యూమరేటర్లకు ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరణ జరుగుతుందని, దీని వలన సమయం ఆదా కావడంతో పాటు డేటా సేకరణ ఖచ్చితత్వం పెరుగుతుందని చెప్పారు.దేశంలోనే మొదటిసారిగా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ విధానం ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ముందుగానే తమ వివరాలను నమోదు చేయాలని కోరారు.మే 1 నుండి హౌస్ లిస్టింగ్ దశ ప్రారంభమవుతుందని, ఈ దశలో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి గృహాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2027లో జనాభా లెక్కింపు రెండో దశగా నిర్వహించబడుతుందని చెప్పారు. సెన్సస్ ద్వారా సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, ఈ డేటాను ఎటువంటి సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయరని స్పష్టం చేశారు. సెన్సస్ డేటా ప్రభుత్వానికి విధానాల రూపకల్పనలో మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రజలు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా నిజమైన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని ప్రజలకు సెన్సస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మీడియా సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు.సుమారు 15 సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్న ఈ సెన్సస్‌ను విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలుచేయాలి

- అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల:** జిల్లాలో నిర్వహించనున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మండల స్థాయి సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని సూచించారు. మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో గురువారం మేడిపెల్లి మండలంలోని పి.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయగ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈరోజు జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారిగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై అర్హులైన ప్రజలకు ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు



సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. జగిత్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, మేడి పెల్లి మండలం స్పెషల్ ఆఫీసర్ సురేంద్ర కుమార్, తహసీల్దార్ మునింధర్, ఎంపీడీవో గంగాధర్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు మరోసారి అమెరికా వార్నింగ్

క్షణాల్లో భారీ సైనిక చర్యలను పునఃప్రారంభించగలమని జనరల్ కెయిన్ అన్నారు. ఈ విరామ సమయాన్ని ఆయుధాలు సమకూర్చుకోవడానికి, వ్యూహాలను సర్దుబాటు చేసుకోవడానికి వినియోగించుకుంటున్నామని అడ్మిరల్ కూపర్ తెలిపారు. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి ప్రాంతీయ భాగస్వాములు తమకు 'అసాధారణ సహచరులు'గా అండగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి ఆపరేషన్లలో ఇరాన్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వారి కమ్యూనికేషన్ వ్యవస్థ మునుపెన్నడూ లేనంత బలహీనంగా మారిందని హెగ్సెత్ పేర్కొన్నారు. మరోవైపు, గల్ఫ్ దేశాల నుంచి ఇంధన సరఫరాలపై ఆధారపడిన భారత్, ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ సంక్లిష్టమైన జలాల్లో దిగ్బంధనాన్ని అమలు చేయడం "సూపర్‌మార్కెట్ పార్కింగ్ లాట్‌లో స్పోర్ట్స్ కార్ నడపడం లాంటిది" అని జనరల్ కెయిన్ వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

# తెలంగాణను పాకిస్తాన్ లా విడదీశారు!

ఈ సందర్భంగా డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హైబ్రిడ్ విధానాన్ని తేజస్వీ సూర్య తప్పుబట్టారు. ఆయనకు ఇలాంటి సలహా ఎవరు ఇచ్చారో తెలియడం లేదని, రేవంత్ వాదనలకు తెలంగాణ ప్రజలు కూడా నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల ఆదాయం ఏటా మారుతుందని, నియోజకవర్గాల పునర్విభజనకు జీఎస్డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వం అవుతుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ఒకరికి ఒక ఓటు ఉంటుందని, ఆదాయం ప్రకారం ఓట్లు ఇస్తే అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వాలని అన్నారు. 'ధనవంతులకు ఎక్కువ ఓట్లు, పేదలకు సున్నా ఓట్లు' అనే తర్కం ప్రకారం 'ముఖేష్ అంబానీకి లక్ష ఓట్లు, మనలాంటి వారికి ఒక్క ఓటు మాత్రమే' వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. పేద, ధనిక, కుల, మత తారతమ్యాలు లేకుండా భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి ఒక్కరికి ఓటు అనే గొప్ప సూత్రాన్ని అందించిందని అన్నారు. దానిని మార్చాలని భావించడం అజ్ఞానమే అవుతుందని ఆయన విమర్శించారు. ఇదే సమయంలో ఆయన తమిళనాడులో అధికార డీఎంకేపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మహిళల అభ్యున్నతిపై డీఎంకే పార్టీవి మొసలి కన్నీళ్లు అని ఆరోపించారు. బీజేపీ నాయకత్వంలోని మోదీ ప్రభుత్వం మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లను కల్పించే ప్రక్రియను 2029 ఎన్నికల నుంచి అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి మూడు బిల్లులను లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టింది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు, పునర్విభజన కోసం 131 రాజ్యాంగ సవరణ చేపట్టనుంది. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 50 శాతం అంటే 815కి పెంచనున్నారు. ఈ పెంపుతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ ప్రక్రియను 2011 జనాభా లెక్కల ప్రకారం చేపట్టడం పట్ల విపక్షాలు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ప్రారంభమైన జనాభా లెక్కల పూర్తయిన తర్వాతే ముందుకెళ్లాలని అంటున్నారు.

# తేజస్వీసూర్యపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫైర్

భారత్ పాక్‌లను విడగొట్టినట్లుగా తెలంగాణ విభజన చేసినట్లుగా చెప్పడాన్ని ఖండిస్తున్నారు.బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఏర్పాటును అవమానించడం బీజేపీకి అలవాటుగా మారింది. గతంలో ప్రధాని మోదీ పార్లమెంటులో తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని అంటే, ఇప్పుడు ఈ ఎంపీ అంతకంటే ఘోరంగా మాట్లాడుతున్నారు అని విమర్శించారు. వందలాది మంది బలిదానాలతో, దశాబ్దాల పోరాటంతో సిద్ధించిన తెలంగాణను బ్రిటిష్ విభజనతో పోల్చడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా తేజస్వీ సూర్యపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ఏర్పాటు జరిగింది. దీనిని అశాస్త్రీయం అనడం రాజ్యాంగాన్ని అవమానించడమే అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మోడల్‌ను విమర్శించే ముందు, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి కడుతున్న పన్నుల వాటాపై తేజస్వీ సూర్య అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

# తెలంగాణ కులగణన తుది రిపోర్ట్

ఇకపోతే ఈ సర్వే ద్వారా వెల్లడైన సామాజిక వర్గాల బలాబలాలను పరిశీలించగా రాష్ట్రంలో అత్యధిక శాతం మంది బీసీ జనాభా ఉన్నట్లు స్పష్టమౌతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం జనాభాలో బీసీలు 56.36 శాతంగా ఉండగా, ఎస్సీలు 17.42 శాతం, ఓసీ వర్గాలు 15.79,ఎస్టీలు 10.43 శాతంగా నమోదయ్యాయి.అయితే ఈ సర్వేలో 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదు అని పేర్కొనడం విశేషం. ఈ గణాంకాలు భవిష్యత్తులో రాష్ట్రంలో రిజర్వేషన్ల ఖరారుకు మరియు సంక్షేమ పథకాల రూపకల్పనకు దిక్సూచిగా మారే అవకాశం లేకపోలేదు.కులాల వారీగా జనగణన వివరాలను పరిశీలిస్తే అత్యధికంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. మాదిగ సామాజిక వర్గం 36.58 లక్షల మందితో (10.3%) రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత షేక్ ముస్లింలు 27.96 లక్షలతో (7.9%), ముదిరాజ్ వర్గం 26.39 లక్షలతో (7.4%) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. - మాదిగ సామాజిక వర్గం 36.58(10.3శాతం) లక్షల మంది - షేక్ ముస్లింలు 27.96(7.9శాతం) లక్షల మంది - ముదిరాజ్ వర్గం 26.39(7.4శాతం) లక్షల మంది - లంబాడ/బంజారా (6.8%) - యాదవ (5.7%) - రెడ్డి (4.8%) - గౌడ్ (4.6%) - మాల (4.1%) - మున్నూరుకాపు (3.9%) ఈ సమగ్ర సర్వే వివరాలన్నింటినీ సామాన్య ప్రజల అందుబాటు కోసం అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది ప్రభుత్వం.

# ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి

సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుదముట్టించడం కూడా అవసరమని అన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు. భారత్-ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

# మద్దతు ఇవ్వకుంటే మనుగడ ఉండదు

ఈ ప్రయాణానికి కొత్త కోణాన్ని అద్దే పవిత్ర అవకాశం ఈ సభకు లభించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నామన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఒకటేనని ఉత్తరాది, దక్షిణాది తేడాలు లేవన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనగానే కొంత మంది విభజన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే తేడాలు లేవని అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు క్రెడిట్ తమకు అవసరం లేదని విపక్షాలకే ఇస్తామన్నారు. వారికి ప్రచారం చేయిస్తానన్నారు. పేపర్లలో ప్రకటన ఇస్తానని హామీ ఇస్తానన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రధాని నరేంద్ర మోదీ అఖిలేష్ యాదవ్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అఖిలేష్ యాదవ్ నాకు మిత్రుడు, అందుకే ఆయన అప్పుడప్పుడు నాకు మద్దతు ఇస్తుంటారు. నేను సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గం నుండి వచ్చిన మాట నిజమే, కానీ అందరినీ కలుపుకుని వెళ్లడమే నా బాధ్యత. రాజ్యాంగం నాకు ఈ మార్గాన్ని చూపింది, నా దృష్టిలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని మోదీ వ్యాఖ్యానించారు.

# 'సన్'చలన అలం

ఇప్పటికే పలు జిల్లాల్లో వడ దెబ్బకు ఒకరిద్దరు చనిపోయారు. మరికొందరు అపస్మారక స్థితికి వెళ్లాడు. అందుకే ఈ విషయాన్ని ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంది.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, విపత్తు నిర్వహణ శాఖ రంగంలోకి దిగాయి. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దానకిశోర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మాల్స్, బస్టాండ్, ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు. మంచినీటితోపాటు మజ్జిగ అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి నోడల్ అధికారులను నియమించి, రోజువారీ పరిస్థితులపై నివేదికలు పంపాలని ప్రభుత్వం కోరింది.

మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగాలని, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని చెబుతున్నారు. లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ లేదా గొడుగు వాడాలి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బయట పని చేసే కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలి.నిప్పులు కురిసే ఎండల నుంచి త్వలోనే ఊరట లభించనుంది.

# క్షేమంగా మీ గమ్యస్థానానికి చేరండి..!

## రోడ్డు భద్రతలపై ఎస్సై సుదీర్ రావు అవగాహన



రాయికల్ (తెలంగాణ వాణి) ప్రజలు, ఆటో డ్రైవర్లు ప్రయాణాల సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి క్షేమంగా గమ్యస్థానానికి చేరాలని ఎస్సై సుదీర్ రావు అన్నారు. గురువారం రాయికల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో యువత,ఆటో డ్రైవర్, ప్రజాప్రతినిధులకు "అరైవ్ ఎ లైవ్" రోడ్డు ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్,వాహనాల చోదకులకు రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. పరిమితికి మించి ఓవర్ లోడు ప్రయాణం చేయకూడదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల దీనస్థితిని వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని పోలీసులు పిలుపునిచ్చారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్, తాహసిల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి, కౌన్సిలర్ రాకేష్, నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, మచ్చ శేఖర్, బాపురపు రాజీవ్, సాయి, ఏఎస్ఐ సైఫోద్దీన్, పోలీస్ సిబ్బంది యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుకు తక్షణమే లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలి...



చిగురుమామిడి:ఎప్రిల్ 16 ( తెలంగాణ వాణి విలేఖరి ) కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం,విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చేతికొచ్చిన మొక్కజొన్న పంట షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు బొల్లి లింగయ్యకు లక్ష రూపాయల తక్షణ నష్టపరిహారం అందజేసి,విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో బుధవారం కాలిపోయిన మొక్కజొన్న పంటను బిఆర్ఎస్ పార్టీ నాయకుల బృందం బాధిత రైతులతో కలిసి ప్రమాదం జరిగిన తీరును గురువారం పరిశీలించారు. ఎన్నో కష్టాలు పడితే పంట చేతికి వచ్చిందని సంబర పడేలోపే ఇలా 30గుంటల్లో పంట షార్ట్ సర్క్యూట్ జరిగి పంట కాలిపోవడం చాలా బాధాకరమని బాధిత రైతు లచ్చవ్వ సంపత్ లను ఓదార్చారు. లూజు వైర్లతో ప్రమాదం జరుగుతుందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడం,రైతుల సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కాలిపోయిన పంటను పరిశీలించి తక్షణ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చిగురుమామిడి మండల రైతంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని,అత్యధిక ఓట్ల మెజారిటీ ఇచ్చి గెలిపిస్తే ఇక్కడి ప్రజలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాగునీరు అందక 100ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతే కనీసం రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని,ఈ ప్రాంత ప్రజలకు మంచి బుద్ధి చెబుతున్నారని మంత్రి తీరుపై మండిపడ్డారు. మంత్రి వెంటనే స్పందించి బాధిత రైతును ఆదుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి వేణు,బీసీ సెల్ మండల అధ్యక్షుడు అనుమల్ల సత్యనారాయణ,మాజీమండల కో ఆప్షన్ మక్బుల్ పాషా,కూతురు శరభందర్ రెడ్డి, దోనపాటి కృష్ణారెడ్డి,దామ శ్రీనివాస్,ఎడెల్లి సంపత్,వార్డ్ సభ్యుడు ఆగయ్య,పిల్లి యాదగిరి,కూతురు వెంకట్ రెడ్డి, కాంటారెడ్డి తిరుపతిరెడ్డి,మెడవేని బుచ్చయ్య,తదితరులు ఉన్నారు.

# రాం సాగర్ గ్రామంలో ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రాంసాగర్ గ్రామంలో ఐకెపి కెంద్రాన్ని ప్రారంబిచారు. రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐకెపి సహకార సంఘాల ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాయి. గురువారం కొమురవెల్లి మండలంలోని రాంసాగర్ లో గ్రామ సర్పంచ్ అక్కేనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ ... కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, తూకంలో పారదర్శకత పాటించాలని అధికారులకు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర నేరుగా రైతులకు అందుతుందని గ్రామాల్లో కేంద్రాలు ఉండటంవల్ల రవాణా భారం తగ్గుతుందని, గ్రామాల్లో కొనుగోలు కేంద్రంలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏసి రెడ్డి మల్లారెడ్డి వార్డు సభ్యులు ఏపీవో, ఐకెపి సెంటర్ నిర్వాహకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, హమాలీ సభ్యులు, నాయకులు, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- మున్సిపల్ విలీన వార్డుల అభివృద్ధికి 30 కోట్లు
: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి
: మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష



ఆదిలాబాద్, ఏప్రిల్ 16 ( తెలంగాణ వాణి ప్రతినిధి) ప్రభుత్వం ఏదైనా అంతిమంగా ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాదు నియోజకవర్గ శాసన సభ్యులు పాయల్ శంకర్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ఎస్టీయూ భవన్లో నిర్వహించిన మున్సిపల్ స్థాయి సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్ లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ముందుగా మున్సిపల్, వైద్య, పోలీస్ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని సమావేశంలో అధికారులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను అతిథులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు చేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాపారాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా అంతిమంగా ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయడానికి 99 రోజుల ప్రణాళిక చేపట్టడం జరిగిందని, అధికారులు ప్రజలవద్దకు వచ్చి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. దరఖాస్తుదారుల సమస్యలపై తీసుకున్న చర్యలపై లేఖల ద్వారా తెలియజేసేలా కొత్త నాందికి శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ వీలైన వార్డుల అభివృద్ధికి 30 కోట్లు కేటాయించడం జరిగిందని, పట్టణానికి శాశ్వత నీటి సమస్య పరిష్కారంతో పాటు సమగ్ర అభివృద్ధి కోసం పటిష్టమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో నీటి పంపింగ్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్లో భాగంగా లండ సాగ్రి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. వచ్చే ఏడాది అక్టోబర్ నుండి జనవరి లోపు ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, ఇది పూర్తయితే వేసవిలో కూడా పట్టణానికి పుష్కలంగా నీరు అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ కౌన్సిల్, అధికారులు మరిన్ని కొత్త ప్రాజెక్టులను గుర్తించి డిటైల్డ్ రిపోర్ట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, మున్సిపాలిటీ యొక్క అంతర్గత వనరులను పెంచుకోవడం ద్వారా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపారు. జూన్ 2వ తేదీ నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ భరోసా బీమా' పథకాన్ని ప్రారంభించబోతుందని, దీని ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి చనిపోతే 5 లక్షల రూపాయల బీమా అందుతుందని వివరించారు. అదేవిధంగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ వరకు అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అర్హులైన వారికి పథకాలతోపాటు ఆయా శాఖల వారీగా చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా 99 రోజుల యాక్షన్ ప్లాన్ తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి శాఖకు వారం రోజుల సమయం కేటాయించి వారి నివేదికలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్, అదనపు కలెక్టర్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎల్డీఎం ఉత్పల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎంహెచ్ఓ. డా.రాథోడ్ నరేందర్, డీవైఎస్ఓ శ్రీనివాస్, సంక్షేమ అధికారి మిల్కా, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, తహసిల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అన్నపూర్ణ, స్వాతి, ధోని జ్యోతి, చరణ్ గౌడ్, మున్న జైస్వాల్, గంట జీవన్,, ఆత్రం వేంకటేష్, నాగ్ సేన్, మహెబూబ్, సంజయ్, అంగన్వాడీలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



వనపర్తి:ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి ప్రతినిది) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గోపాల్‌పేట్, పెబ్బేర్‌లలో నిర్వహించిన సభల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, ఆర్థిక సవాళ్లున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీ పడకుండా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. తాము పాలకులం కాదు సేవకులమని, ప్రజల అవసరాలే కేంద్ర బిందువుగా పనిచేస్తున్నామని తెలిపారు. వార్డుల వారీగా నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి పథకం ప్రజల జీవితాల్లో మార్పు తేవాలని పేర్కొన్నారు.

?అనంతరం, పోల్కేపహాడ్ గ్రామంలో మద్యపానాన్ని నిషేధించిన సర్పంచ్ బంగారయ్యను చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి శాలువాతో సన్మానించారు. రైతులు పంట మార్పిడి విధానం పాటించాలని, ప్రజలు మద్యానికి దూరంగా ఉండి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. మహాలక్ష్మి, రూ. 500 గ్యాస్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, విజయవర్ధన్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పవిత్రన్ మాతృమూర్తి కి రమేష్ గౌడ్ ఘన నివాళులు



నర్సంపేట : ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి) నర్సంపేట పట్టణ వాస్తవ్యులు వడ్లకొండ పవిత్రన్ గౌడ్, నివిత్రన్ గౌడ్ ల మాతృమూర్తి ప్రేమనిల హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందగా వడ్లకొండ ప్రేమనిల పార్థివ దేహానికి పూలమాలవేసి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ నివాళులు అర్పించా రు. అనంతరం ప్రేమనీల కుటుంబసభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఉగ్గిడి శివుడు, అబ్బు వెంకట్ రెడ్డి, కారుపోతుల విజయకుమార్ గౌడ్ ,తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్, ఊడ్గుల శ్రీనివాస్ గౌడ్ రడం శ్రీనివాస్ గౌడ్, కుండే సురేష్, వడ్లకొండ రాజుగౌడ్, మహాదేవుని, నరేష్, రవి తేజ, గట్టు అమర్, తోటకూరి సదా నందం, శ్రీనివాస్, రాంబాబు, నల్ల మనోహర్ రెడ్డి, నాగేల్లి వెంకట నారాయణ, కౌన్సిలర్స్ బత్తిని రాజేందర్, వేముల సాంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 20 న కాళేశ్వరానికి సీఎం రాక



మహాదేవపూర్ (తెలంగాణ వాణి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. గురువారం కాళేశ్వరం త్రివేణి విశ్రాంతి భవనంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి గర్భాలయం, శుభానంద దేవి అమ్మవారు ఆలయాల పునరుద్ధరణ, పున ప్రతిష్ట ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, ఈఓ మహేష్, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 20వ తేదీన ఆలయ పున ప్రతిష్ట పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నందున శిలాఫలకం, భూమి పూజ పనులకు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ఈఓ ను ఆదేశించారు. అనంతరం కమిషనర్ హనుమంతరావు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శుభానంద దేవిని,సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి చేపట్టనున్న పనులను ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ వివరించారు.

RNI No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026

# విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## అన్నా మెమోరియల్ పాఠశాల మేనేజర్ చిన్నప్ప రెడ్డి




చౌటుప్పల్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని అన్నా మెమోరియల్ పాఠశాలలో 2025-26 మార్చిలో నిర్వహించిన సీ బీఎస్ ఈ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలతో పాఠశాల గర్వకారణంగా నిలిచింది.ఈ ఫలితాల్లో ముఖ్యంగా పాఠశాల టాపర్ విద్యార్థిని సాన్వి 500 లో 473 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. అలాగే పలువురు విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజర్ చిన్నప్ప రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకమే ఈ విజయానికి కారణమని, విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల కట్టుబడి ఉందని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# సీట్ బెల్ట్ పై అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మోడెం సురేష్



రాజన్న సిరిసిల్ల (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) అరైవ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా డిజిపి,సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి.గీతే ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మోడెం సురేష్ సీట్ బెల్ట్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకొని వాహనాన్ని నడపాలని, లేనిచో ప్రమాదాలు జరిగినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావని, తద్వారా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు.అదేవిధంగా డ్రైవర్ తో పాటు ఇతర సీటులో కూర్చున్న ప్రయాణికులు కూడా తూచా తప్పకుండా సీట్ బెల్ట్ ను ధరించాలని తెలియజేశారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని,ఉత్తమ పౌరులుగా ఉండాలని తెలియజేశారు. వాహనదారులు అందరితో రహదారి భద్రత ప్రతిజ్ఞను చేయించారు. సీటు బెల్టు ధరించిన వాహనదారులకు ఔత్సాహికంగా వినూత్న పద్ధతిలో చాక్లెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,ఏఎంవిఐ పృద్విదర్,సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ లో చేరిక



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఎమ్మెల్యే మదన్ మోహన్ రావ్ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడై, ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామం 7వ వార్డు సభ్యులు పెద్దెడ్ల అశోక్, మండల పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేస్తున్న అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుని, తన 7వ వార్డును కూడా అభివృద్ధి బాటలో నడిపించాలని సంకల్పంతో పార్టీలో చేరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా ఆశమొల్ల, ఉప సర్పంచ్ శేరిపల్లి మీనా సాయిలు, మల్కాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు కాటేపల్లి సాయిలు, సభ్యులు కటికెల నారాయణ, నసురపల్లి నర్సింలు, కటికెల బాలాజీ, కటికెల శ్రీను, కటికెల అంజయ్య మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా మోహన్‌రావు పాటిల్



నిర్మల్--భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి): భైంసా పట్టణానికి చెందిన జాదవ్ సావిత్రిబాయి కుటుంబానికి ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్ ఆర్థిక సాయం అందించారు. సావిత్రిబాయి భర్త బాబురావు ఇటీవల మృతిచెందగా,కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన చెక్కు రూపంలో సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు పాటిల్ మాట్లాడుతూ బీజేపీ 'పల్లె పల్లెకు--గడప గడపకు' కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సావిత్రిబాయి కుమారుడు గణేష్ చేసిన సేవలు అభినందనీయమని తెలిపారు. కార్యకర్తల కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమ ప్రజా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే అనుకోని సంఘటనలు ఎదురైన సందర్భాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సహాయం చేయడంలో తమ ట్రస్ట్ ముందుంటుందని స్పష్టం చేశారు.

# ఎంపీడీవో దొండ కృపాకర్ అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక

## ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్




ఎండపల్లి (తెలంగాణ వాణి) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో గురువారం రోజున ఎస్ ఆర్ ఆర్ గార్డెన్ లో మండల స్థాయి సమావేశం లో ప్రజాపాలన--ప్రగతిప్రణాళిక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు లో భాగంగా ఎండపల్లి మండల రాజారాంపల్లి లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండపల్లి మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశం లో మండల తహసిల్దార్ మాట్లాడు తూ లబ్ది పొందుతున్న వారి వివరాలు ఎండపల్లి మండల పరిధి లో చేయూత పెన్షన్ వృద్ధప్య 1817, వితంతువు 1204, వికలాంగులు 558, గౌడ కళాలి 172, చేనేత 132, ఒంటరి మహిళ 127, బీడీ కార్మికులు 586, మొత్తం కలిపి 4596 పెన్షన్లు లబ్ధి పొందుతున్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 210 మంది లబ్ధిదారులకు అందజేశామని, కొత్త రేషన్ కార్డ్స్ మరియు కన్వర్షన్ మొత్తం కలిపి 3862 కుటుంబాలకు రేషన్ కార్డ్స్ మంజూరు అయ్యాయని. అలాగే ఇందిరమ్మ మహిళా శక్తి గ్రూపులకు ఇందిరమ్మ చీరలు 5926 చీరలను పంపిణీ చేశామని, అలాగే వడ్డీ లేని రుణాలు డాక్రా మహిళలకు 262 గ్రూపులకు వడ్డీ లేని రుణాలు అందించామని, మండల తహసిల్దార్ తెలిపారు. మండల ఎంఈఓ సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అల్పాహారం పాలు పథకం కింద ప్రతి పాఠశాలకు అందిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ ఏఈ గౌతమి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మండల పరిధిలో 476 ఇండ్లు మంజూరు అయ్యాయని ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున 23 కోట్ల 80 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ ఏవో కమాల్ల మహేష్ మాట్లాడుతూ రైతు బీమా పథకం కింద 41 మంది లబ్ధిదారులకు 5 లక్షల చొప్పున రైతు బీమా రూపాయలు 2 కోట్ల ఐదు లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందించామని, రైతు భరోసా కింద 9809 మంది రైతులకు 8 కోట్ల 86 లక్షల 19 వేల 550 రూపాయలను అందించామని ఏవో తెలిపారు. ఆరోగ్యశాఖ నుండి డాక్టర్ పి లవ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికీ మండల పరిధిలోని కొంతమందికి ఆపరేషన్లను గుర్తించి వారికి అన్ని రకాల ఆపరేషన్లు చేయించామని తెలిపారు విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం కింద 200 లోపు యూనిట్లను 5379 మందికి ప్రతినెల 15 లక్షల 36,630 రూపాయలను జీరో బిల్లు కింద అందించామని తెలిపారు. అలాగే ఇండ్ల మీద కెళ్ళి వెళ్లే లైన్లు ఉన్నచో అట్టి వాటికి మంత్రి గారు ప్రత్యేక నిధి కింద కొంత అమౌంట్ ఇచ్చారని వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు మీటర్ల కొరకు రెండు వేల రూపాయలు డిడి కట్టినచో ఐదు నుండి పది పోర్లు ఒక కిలోమీటర్ వరకు లైన్లు వేస్తామని ఏఈ తెలిపారు. ఏపీఎం తులసి మాత మాట్లాడుతూ మండల పరిధిలో వడ్డీ లేని రుణాలు డాక్రా గ్రూపుల కు 26 గ్రూపులకు 31 కోట్ల 39 లక్షల 59 వేల రూపాయలను అందించామని తెలిపారు. ఐసి డిఎస్ సూపర్వైజర్ అండాలు మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్త అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కింద ప్రతి పిల్లలకు అందించామని వివరించారు. ఎండపల్లి సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజారాంపల్లి సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మాట్లా డారు. అలాగే ఎండపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామాల నుండి సర్టిఫికెట్లు పెండింగ్లో ఉంటున్నాయని మా దృష్టికి వచ్చిందని తాసిల్దారుకు వివరించారు. నిబంధనలు, క్షేత్రస్థాయి లో అమలుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారు ల పై ఉందన్నారు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మాత్రం అత్యంత ఉత్సాహంగా ఉన్నారు వారు గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళికపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతి నిధులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లో అధి కారులు, ప్రజాప్రతినిధులు సమ న్వయం తో పనిచేయాలి. ఈ కార్యక్రమం లో వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్ల తిరుపతి, ఏఎంసి డైరెక్టర్లు సర్పంచులు సంఘ రమేష్ యాదవ్, జీరెడ్డి మహేందర్ రెడ్డి, తాటిపర్తి రాజవ్వ, గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, మారం సునీత-జలంధర్ రెడ్డి, కందికట్ల అమృత-రాజేష్, బాలసాని శారద-మల్లేశం, ఆవుల మమత-తిరుపతి, సింగిరెడ్డి లింగారెడ్డి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, గాదం భాస్కర్, కోడిపెల్లి కొమరమ్మ-శ్రీనివాస్, బెద్దల ప్రవీణ్ పడిదం లావణ్య-మొగిలి, దర్శనాల నరేష్ సర్పంచులు పాల్గొన్నారు మాజీ సింగిల్ విండో చైర్మన్ గూడ రాంరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు, సీసీలు, సిఏలు, వివోలు, మహిళలు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను తగ్గించి మరణాల రేటును అరికట్టడమే పోలీసుల కర్తవ్యం

## ఎల్లారెడ్డి ఎస్ ఐ బొజ్జ మహేష్.




ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఎల్లారెడ్డి పోలీస్ శాఖ ఎస్ ఐ బొజ్జ మహేష్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బస్ స్టాండ్ , తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మహేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించి, మరణాల రేటును అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం , పోలీసులు సంయుక్తంగా "అరైవ్ అలైవ్" అనే ప్రత్యేక రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రయాణికులు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, ఆటో డ్రైవర్లు, భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిస్తామని ప్రతిజ్ఞ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్ కుమార్ , డి టి శ్రీనివాస్ , ఆర్ ఐ శ్రీనివాస్ , పోలీస్ సిబ్బంది ప్రేమ్ సింగ్, అనిల్ గౌడ్ , పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలపై అవగాహన కార్యక్రమం



హసన్‌పర్తి (తెలంగాణ వాణి ప్రతినిది) వల్లభాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపే తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ఉచిత సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. సర్కారు బడిలో సుశిక్షితులైన ఉపాధ్యాయులతో పాటు డిజిటల్ తరగతులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు మరియు క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ?విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనంతో పాటు బాలికలకు స్వీయ రక్షణ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వం ఉదయం అల్పాహారం, 15 రకాల వస్తువులతో కూడిన కిట్ కూడా అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట స్వామి, పద్మలత, వెంకట సుహాసిని, కల్యాణి, రమాదేవి, శోభారాణి, ప్రేమ్ ప్రసాద్‌రావు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# జావీద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

## స్వర్గీయ కాంగ్రెస్ నేత జావేద్ చిత్రపటానికి నివాళులర్పించిన'' ఖురేషి "



కొత్తగూడెం (తెలంగాణ వాణి) సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఖమ్మం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పిసిసి సభ్యులు మహమ్మద్ జావేద్ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం అత్యంత దురదృష్టకరం. ఈ విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, ఖమ్మం రెడ్ హిల్స్‌లోని వారి స్వగృహానికి వెళ్లి, జావేద్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహమ్మద్ జావేద్ మరణం కాంగ్రెస్ పార్టీకి మరియు మైనార్టీ విభాగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి, నాయకత్వం ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# నారీ శక్తి వందన్ పాదయాత్ర



హైదరాబాద్/ శేరిలింగంపల్లి ఏప్రిల్ 16 (తెలంగాణవాణి విలేకరి) బీజేపీ కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో మన ప్రధాని నరేంద్ర మోదీ కి,బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ రోజు చందానగర్ డివిజన్ మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బి.హెచ్.ఈ.ఎల్ చౌరస్తా వరకు నిర్వహించిన నారిశక్తి వందన్ పాదయాత్ర లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి.జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్,శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళా మోర్చా నాయకురాళ్లు, కార్యకర్తలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా కోట్లాది మహిళల ఆశయాలకు ప్రతిరూపమని, ఇది భారత రాజకీయాల్లో ఒక కొత్త యుగానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు.గతంలో మహిళా సాధికారతపై మాటలు మాత్రమే వినిపించగా, అమలు చేయడానికి ధైర్యం చూపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు, బీజేవైఎం నాయకులు, మహిళా నాయకులు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# చందుర్తిలో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సభ..

**- ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



వేములవాడ (తెలంగాణ వాణి ప్రతినిధి) చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' మండల సభను నిర్వహించాగా,ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సభ ప్రారంభంలో తెలంగాణ గీతాన్ని ఆలపించగా, అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ 'అరైవ్ - అలైవ్' కార్యక్రమంలో భాగంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాలనేదే ఈ సభ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆక్వా గార్డ్ నీటి శుద్ధి యంత్రాలను, వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్‌ను, లబ్ధిదారులకు మూడు నెలల కోటా సన్నబియ్యం పంపిణీ చేశారు. మండలంలో పథకాల అమలు తీరును ఎంపీడీఓ రాధ వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 525 మందికి మంజూరు కాగా, ఇప్పటికే 98 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 427 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా 6,688 కుటుంబాలు గ్యాస్ సిలిండర్ లబ్ధి పొందుతున్నాయని, గృహజ్యోతి కింద 7,064 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతోందని పేర్కొన్నారు. అలాగే రైతు సంక్షేమంలో భాగంగా 3,535 మందికి రుణమాఫీ, 10,867 మందికి రైతు భరోసా వర్తించిందని వెల్లడించారు. మహిళా సంఘాల బలోపేతానికి 401 సంఘాలకు బ్యాంకు లింకేజీ, 831 సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించినట్లు వివరించారు.10,119 మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు, 1,072 మందికి కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకాలు అందాయని తెలిపారు.?అనంతరం వ్యవసాయ, ఉద్యానవన,స్త్రీ శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అదనపు కలెక్టర్ సందర్శించారు.పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ భూపతి,ఎంపీఓ ప్రదీప్ కుమార్, వ్యవసాయ అధికారి దుర్గారాజ్ తదితర అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఉత్సాహంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' పట్టణ సభ

**సంక్షేమ పథకాల అమలుపై అధికారుల సమీక్ష**

**ప్రజా పాలన లక్ష్యం పేదల సంక్షేమమే**

**పట్టణ సభలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



వేములవాడ,ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో పట్టణ సభను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మరియు కమిషనర్ సమక్షంలో జరిగిన ఈ సభలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రజా పాలన లక్ష్యం ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలను అందించడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీ - ప్రైమరీ నుండి ఇంటర్ వరకు అల్పాహార పథకం, ప్రతి కుటుంబానికి ధీమానిచ్చే ఇందిర కుటుంబ జీవిత బీమా, మరియు మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు పొడిగించడం వంటి చర్యలు విద్యా, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తాయని పేర్కొన్నారు.?అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందేలా ప్రజా పాలన ప్రణాళిక ద్వారా ప్రత్యేక కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు.అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధికి 150 కోట్లు, రోడ్ల విస్తరణకు 46 కోట్లు, పట్టణ మౌలిక సదుపాయాల కోసం మరో 4.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పట్టణ రూపురేఖలను మారుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ద్వారా పొన్నాల స్వామికి వీల్ చైర్, అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ ప్యూరిఫైర్లను పంపిణీ చేశారు. ఈ సభలో ఆర్‌డీఓ రాధా భాయ్, వైస్ చైర్మన్ నరాల శేఖర్,పట్టణ సీ.ఐ వీర ప్రసాద్,కౌన్సిలర్లు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం

రాజపేట: ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి విలేకరి) మండల కేంద్రంలోని కుర్రారం గ్రామంలో బూరు పోశెట్టి గత కొద్ది రోజుల క్రితం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో కాలుజారి కిందపడి మరణించాడు. వారి కుటుంబానికి రాజపేట మండలం కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ తరపున ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగారాజపేట గ్రామ



ఉప సర్పంచ్ కేదారి గౌడ్ 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రాజపేట మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్, గౌరవ అధ్యక్షు లు గోపగాని యాదగిరి గౌడ్ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ ఉపాధ్యక్షులు గోపాల్ గౌడ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్ గౌడ్ ఉప సర్పంచ్ కేదారి గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు గ్రామ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ బసవరాజు గౌడ్ బసవయ్య గౌడ్ లక్ష్మణ్ గౌడ్, యాదగిరి గౌడ్ లక్ష్మీనారాయణ గౌడ్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జనగర్జనను జయప్రదం చేయాలి

**- మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్**



రాయికల్: ఏప్రిల్ 16(తెలంగాణ వాణి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జగిత్యాల జనగర్జనను జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీంధర్ అన్నారు.గురువారం రాయికల్ పట్టణంలోని వర్తక సంఘంలో బిఆర్ఎస్ ముఖ్య నేతలు,జీవన్ రెడ్డి అభిమానులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని దిశా నిర్దేశం చేశారు.లక్ష మందితో జరగబోయే ఈ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో పార్టీని జగిత్యాల నుండే జైత్రయాత్రను ప్రారంభించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాయికల్ పట్టణంలో 12 వార్డుల్లో ఇన్చార్జిలను ఏర్పాటుచేసి జన సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి కెసిఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరిక, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం,కేసీఆర్ సమక్షంలో భారీ చేరికలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎలిగేటి అనిల్,తురగ శ్రీధర్ రెడ్డి, మ్యాకల రమేష్, కొయ్యేడి మహిపాల్, రాకేష్ నాయక్, మారంపల్లి సాయికుమార్, మహేందర్, దాసరి గంగాధర్, ఏనుగందుల లింగం గౌడ్, బత్తిని భూమయ్య,షాకీర్, మొభిన్ ,శ్రీకాంత్, దిలీప్, కడకుంట్ల నరేష్, బొంగుని భూమా గౌడ్, కట్ల నర్సయ్య, రామచంద్రం, విక్రమ్, వంశీ, తిరుపతి, రమేష్, నరేష్, షంషిర్, నవీన్, భూమయ్య, గణేష్, రమణ, రాజారెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత

**అరైవ్...అలైవ్ కార్యక్రమంలో భాగంగా**

**వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు**



జగిత్యాల (తెలంగాణ వాణి ప్రతినిధి) జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అరైవ్...అలైవ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నాలుగవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వలననే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ మరియు బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని అన్నారు.అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించడం జరిగింది. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశ ఏర్పాటు



బుగ్గారం (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగారం మండలం కేంద్రంలో గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశ కార్యక్రమం లో భాగంగా బుగ్గార మండలం అన్ని గ్రామాల సర్పంచులు వార్డ్ మెంబర్లు అన్ని శాఖల అధికారులు పాల్గొంటూ ప్రభుత్వం చేపట్టి ప్రవేశపెట్టిన అటువంటి పథకాల గురించి వివరిస్తూ ప్రజలకు తెలియజేశారు. స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతానికి చేపట్టినటువంటి పథకాల సూచన మేరకు అధికారులు ఏ శాఖ అధికారి ఆ శాఖకు సంబంధించిన పనులను నిర్వర్తిన్నామంటూ తెలియపరిచారు. ఎంపీడీవో వారు గ్రామ సెక్రెటరీ మరియు సర్పంచులకు ఏ విధమైన పనులైన కైనా అందుబాటులో ఉంటామని తెలియపరిచారు. ఎమ్మార్వో సిబ్బంది కూడా ప్రభుత్వ సూచన మేరకు ప్రజలకు అందించే పనులకు అందుబాటులో ఉంటున్నామని తెలియపరుస్తూ వివరించారు. వ్యవసాయ అధికారి రైతులకు ఇచ్చే సబ్సిడీ వివరాలు వివరిస్తూ తెలియపరిచారు. రైతులకు ఏ అవసరం ఉన్న మమ్మల్ని సంప్రదించవచ్చని అవకాశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్ కూడా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టినటువంటి పథకాల గురించి వివరిస్తూ ప్రజలకు ఎలాంటి లోటు బాట్లు ఉన్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి మీ వెనువెంట ఉండి మీకు అందుబాటులో పనిచేసి పెడతానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల విషయానికొస్తే ఎవరికైతే ఇల్లు రాలేదో వారికి వచ్చే సెకండ్ లిస్టులో వీలు ఉంటదని తెలియజేశారు. అన్ని గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు వార్డ్ మెంబర్స్ గ్రామ సెక్రెటరీ స్

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులువేముల సుభాష్ వెంట ఉపాధ్యక్షులు నరస గౌడ్ మరియు రెవెన్యూ సిబ్బంది ఎంపీడీవో సిబ్బంది స్పెషల్ ఆఫీసర్ విద్యుత్ శాఖ సిబ్బంది వ్యవసాయ శాక సిబ్బంది పోలీస్ సిబ్బంది ఆశ వర్కర్స్ అంగన్వాడి ఇరిగేషన్ అన్ని శాఖల వారు అన్ని గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగింది.

# విద్యార్థులు చదువుతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి- ప్రిన్సిపల్



ధర్మారం: ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి) మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో ఘనంగా ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ప్రిన్సిపల్ అరుణ. ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపల్ అరుణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో స్థిరపడుతారని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. మల్లాపూర్ గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ మొత్తం శిక్షణ కార్యక్రమాన్ని ఒకేషనల్ ట్రైనర్స్ సుప్రజ, పుష్పలత విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నరు.

# ఇంద్రేశం పాఠశాల విద్యార్థులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ గ్రంథాలయ పుస్తకాల పంపిణీ



పటాన్ చెరు, ఏప్రిల్ 16, (తెలంగాణ వాణి రిపోర్టర్) గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి సోపానాలు అని ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సంగారెడ్డి జిల్లా టీం లీడర్ రామలక్ష్మి అన్నారు. ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో గురువారం నాడు మండల పరిధి లోని ఇంద్రేశం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్య క్రమం లో విద్యార్థులకు ఉత్సాహాన్ని, స్ఫూర్తినిచ్చే కథల పుస్తకాలను పంపిణీ చేశారు. ఇందులో వివిధ స్థాయిల ననుసరించి వివిధ రకాల పుస్తకాలను అంద జేసి వారికి పఠనం పట్ల ఆసక్తి కలిగేలా చేయడంతో పాటు వారికి ధారాళంగా చదివేలా చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యమని ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు శ్రీనివాస్ రావు సంస్థ సభ్యులు విద్యార్థులకు అందిస్తున్న సేవ పట్ల ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# పెద్ద కోమటిపల్లి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు




మొగుళ్ళపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) మొగుళ్లపల్లి మండలంలోని పెద్ద కోటిపల్లి పంచాయతీ కార్యదర్శి,సర్పంచ్, ఇద్దరిపై నిధులు దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారంటూ భూపాల్ పల్లి జిల్లా కలెక్టర్ కు గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు కలిసి బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్లుగా వారు తెలిపారు పంచాయతీ ఎన్నికలు జరిగి పట్టుమని ఐదు నెలలు కావస్తుంది. ఇంతలోనే అవినీతికి పాల్పడుతున్నారంటూ వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 150 స్తంభాలు మచ్చుకు 50 బుగ్గలు తీసుకొచ్చి పాత కరెంటు బుగ్గలనే కొత్తవిగా చూపిస్తూ ప్రతి ఒక స్తంభాన్ని సిబ్బంది తోటి ఎక్కించినట్లు నటించి పాత వాటిని సరి చేస్తే కొత్త బుగ్గలుగా క్రియేట్ చేస్తూ జమ్మికుంట పట్టణం నందు కొంత మంది ఎలక్ట్రికల్ షాపుల నుండి కొనుగోలు చేసినట్లుగా తీసుకొచ్చి, మొత్తం 150 బుగ్గలకు గాను 450 రూపాయల చొప్పున 64,600గా ఎలాంటి సమాచారం వార్డు సభ్యులకు లేకుండా ఉపసర్పంచ్ లేకుండా మెయిల్స్ బుక్కులో రాపిచ్చి నోట్ ఫైల్ అనే బుక్ రికార్డులో 64600 బిల్లు చేసుకొని సర్పంచ్ గ్రామ కార్యదర్శి ఇద్దరు కూడా సంతకం చేసి అవినీతికి పాల్పడినట్లుగా ఆరోపించారు.

అంతలోనే కొంతమంది వార్డు సభ్యులు కలిసి ఉపసర్పంచ్కి సమాచారం అందించగా తను ఇదేమిటని ప్రశ్నించగా గ్రామ కార్యదర్శి సర్పంచ్ అమ్మ రాయమన్నది అని కార్యదర్శి నాకేం తెలుసు కార్యసి రాశారని సర్పంచి ఇద్దరు ఒకరిపై ఒకరు తోసిపుచ్చుకోవడం జరిగిందని ఉపసర్పంచ్ వారి సభ్యులు తెలిపారు అసలు మీరు తీసుకొచ్చిన బుగ్గలు ఎన్ని 150 బుగ్గలు తీసుకొచ్చినాకని కూడా 30 వేల రూపాయల కంటే ఎక్కువ కావు అయినా 64,600 వ్రాసుకోవడమేంటి అని ప్రశ్నించగా మేము డిపిఓ దగ్గరికి వెళ్తాము అని అంటే డిపిఓ కాదు కలెక్టర్ దగ్గరికి వెళ్ళండి అని సర్పంచ్ భర్త సమాధానం చెప్పినట్లుగా దానికి సరే అని వంత పాడినట్టు గ్రామ కార్యదర్శి ఇంద్రసేన వ్యవహరించారు అని తెలిపారు. ఇది ఇలా ఉండగా గ్రామ సిబ్బంది అసలు పెద్ద కోటిపల్లి గ్రామ జనాభా ప్రకారంగా ముగ్గురు సిబ్బంది ఉండాలి పోయిన గ్రామ సర్పంచ్ సునీల్ రెడ్డి ఇంకొక సిబ్బందిని అదనంగా పెట్టడం జరిగింది. దాంతో నలుగురు సిబ్బంది పెద్దకొడుపల్లి గ్రామపంచాయతీకి ఉండడం జరుగుతుంది అయితే గ్రామ కార్యదర్శి ఇంద్రసేన సిబ్బందిపై విచక్షణ రహితంగా మాట్లాడడం దుర్భాషలాడడం నచ్చిన సిబ్బందికి హాజరులు వేసి నచ్చని వారిని పనిచేసిన కానీ కూడా హాజరులు వేయకుండా ప్రతినెల ఇబ్బంది పెట్టినట్టుగా గ్రామ పాలకవర్గం దృష్టికి వస్తే వీరందరూ కూడా కార్యదర్శి ఇంద్రసేనాను మందలించడం జరిగింది అయినా కానీ కూడా మరొకసారి నోట్ సైడ్ అనే రిజిస్టర్లో, గ్రామపంచాయతీ నిధుల నుండి నలుగురు సిబ్బందికి జీతాలు ఇచ్చినట్లుగా వ్రాసుకుని సర్పంచ్ కార్యదర్శి ఇద్దరు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సంతకాలు పెట్టినారు, అని వార్డు సభ్యులు ఉపసర్పంచ్ ఆరోపించారు 150 రోజులకే ఇలాంటి దుందులకు వ్యవహారాలు చేస్తున్నటువంటి గ్రామ సర్పంచ్ తనకు వంత పాడుతూ అంతా నేనే అంటూ వ్యవహరిస్తూ సిబ్బందిని దుర్భాషలాడుతూ గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడుతున్న గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఇంద్రసేనాను మరియు సర్పంచ్ ఇందిరాను శాఖపరమైనటువంటి చర్యలు తీసుకోవాల్సిందిగా వార్డు సభ్యులు ఉప సర్పంచ్ కలెక్టర్ ఫిర్యాదు చేశారు. దీని ప్రతిని, డిపిఓ, మొగుళ్ళపల్లి ఎంపీడీవో, ఎంపీ ఓ లకు ఇచ్చినట్లు వారు తెలిపారు .

తెలంగాణ వాణి



## సిపిఐ ఎమ్మెల్సీ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి

# "పోటు" పై కేసు రద్దు చేయాలి

**-దేశద్రోహం ఎన్ఐఏ జాతీయ దర్యాప్తు సంస్థ ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలి**

**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన**




కొత్తగూడెం (తెలంగాణ వాణి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయిన పోటు రంగారావుపై కేంద్ర బి జె పి, ఆర్ ఎస్ ఎస్ ప్రభుత్వం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ( ఎన్ఐఏ) పెట్టిన దేశద్రోహం కేసుకు సంబంధించి నోటీస్ ఇవ్వడాన్ని వెంటనే ఎత్తివేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లాకార్యదర్శి ముద్దా బిక్షం, రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య. డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొట రంగారావు మీద పెట్టిన అక్రమ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,బి జె పి, ఆర్ ఎస్ ఎస్ కేంద్ర ప్రభుత్వం అధినేతలైన అమిత్ షా, మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద, దేశ సంపదను అదాని, అంబానీ లకు దోచిపెడుతూన్నారని ఆరోపించారు. అంతేగాక ప్రజల మీద మోపుతున్న దేశద్రోహం, ఉపా, అక్రమ ఆయుధాలు కలిగివున్నాడని ఎటువంటి ఆధారాలు లేకుండా కుట్ర కేసులను పెడుతున్నారని నోటీసులను ఇస్తున్నారని వారు విమర్శించారు. బి జె పి, ఆర్ ఎస్ ఎస్ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలు, మారనకాండలను ప్రశ్నించిన వామపక్ష, ప్రజాస్వామ్య, ఉద్యమా కారులను వ్యతిరేకిస్తున్నందుకు, నిరసన తెలియపరస్తు నందుకు సహించలేక బంధించుటకు ప్రభుత్వం అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తుందని అని విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ చట్టబద్ధంగా బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజా సమస్యల మీద పోరాడుతున్నదని, పాలకవర్గాలు పెట్టుబడిదారీ వర్గాలు ప్రజలను దోపిడీ చేస్తున్న తీరున్న ప్రజలకు వివరించి, చైతన్య పరుస్తున్నందుకు తప్పుడు కేసులను బనాయించి జైల్ లో బంధించటానికి పూనుకున్న దని వారు విమర్శించారు. ప్రొఫెసర్ సాయిబాబా,వరవర రావు, జేఎన్యు యూనివర్సిటీ నాయకుడు ఉమర్ ఖలీదు, హర గోపాల్, విమలక్క, గాదె ఇన్నయ్య తదితరుల మీద కూడా తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం,దేశద్రోహం కేసులను మోపిందనీ వ్యాఖ్యానించారు. పోటు రంగారావు గారు 50 సంవత్సరాల నుండి విప్లవోద్యమంలో, పి డి ఎస్ యు, పి వై ఎల్ వంటి విద్యార్థి యువజన సంఘాలలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా, మాస్ లైన్ విప్లవ పార్టీఆధ్వర్యలో సుదీర్ఘకాలం పోరాటాలలో పాల్గొన్నారని తెలియపరిచారు. అందుకు కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల మీద పోరాడుతున్నందుకు కట్టడి చేయటానికి తప్పుడు ఆరోపణలు చేసి కుట్ర పద్ధతులలో నోటీసులను బనాయిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉద్యమకారులను ఉద్యమాలను చూసి, దోపిడీ పాలకవర్గాలకు నచ్చటం లేదని వారు విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకత్వంగానీ పోటు రంగారావు కానీ హింసకు వ్యతిరేకమని, చట్టబద్ధ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారనీ, ఇటువంటి ఉద్యమాలను కూడా కేంద్ర ప్రభుత్వం తప్పుడు పద్ధతులలో, దేశద్రోహం, ఉపా, అక్రమ ఆయుధాలు కల్గి ఉన్నాడని లాంటి కుట్ర పూరితమైన, అక్రమంగా నోటి సులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్ మధుసూదన్ రెడ్డి. దానోతు ధర్మ. కల్లూరి కిషోర్. పెద్ద బోయిన సతీష్. బైరి వెంకన్న.. నాగేశ్వరరావు. వర్మ.సాయి తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ క్యాడెట్లకు

# ఘన వీడ్కోలు

**- శిక్షణ పూర్తిచేసుకుని లెఫ్టినెంట్ హోదా పొందిన ఏ.ఎన్.ఓ. అజయ్ కుమార్ కు సత్కారం**



**పటాన్ చెరు** హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు గురువారం హృదయ పూర్వక వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో, గీతంతో పాటు, దేశానికి వారు అందించిన ఆదర్శ ప్రాయమైన సేవ, అంకితభావం, క్రమశిక్షణల ను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పట్టభద్రులవుతున్న క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్.సీ.సీ. శిక్షణ యొక్క నిజమైన విలువ కేవలం 'సి' సర్టిఫికేట్ సంపాదించడం వరకే పరిమితం కాదని చెప్పారు. 'ఇది మీకు స్థైర్యం, క్రమశిక్షణ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ గుణాలే దేశానికి అర్థవంతంగా సేవ చేసేందుకు మీకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గౌరవ అతిథులుగా హాజరై, పట్టభద్రులవుతున్న క్యాడెట్ల అంకిత భావాన్ని, వారి సేవను ప్రశంసించారు.ఈ సందర్భంగా, అసోసియేట్ ఎన్.సీ.సీ. ఆఫీసర్ (ఏ.ఎన్.ఓ) లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కికుమార్ తన శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి, లాంఛనంగా ఆ హోదాను స్వీకరించినందుకు అతిథులు ఆయనను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో, పట్టభద్రులవుతున్న క్యాడెట్లు తమ ఎన్.సీ.సీ. ప్రస్థానం ఎంత గొప్పదో పంచు కోగా, జూనియర్ క్యాడెట్లు తమ కృతజ్ఞతలు, అభినందనలను తెలియజేశారు. పట్టభద్రులవుతున్న క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు. ఎన్.సీ.సీ. విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన వీడియో, అలాగే మరపురాని క్షణాలను చిత్రీకరించిన ఆడియో-విజువల్ ప్రజెంటేషన్, ఈ కార్యక్రమానికి గత స్మృతులను జోడించాయి. క్యాడెట్లు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు, ఆసక్తికరమైన కార్యకలాపాలు ప్రేక్షకుల మన్ననలను పొందాయి.సీనియర్ క్యాడెట్ల వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం గ్రూపు ఫోటో, విందుతో ఈ చిరస్మరణీయ వేడుక ముగిసింది.

## 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



**జహీరాబాద్/టౌన్:** జహీరాబాద్ పట్టణం నాగుల కట్టకు చెందిన నందిని అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 కూ ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది ఈఎంటి సాయికుమార్, పైలట్ దయానంద్ సమాచారం అందుకొని అక్కడికి చేరుకుని పురిటి నొప్పుల తో బాధపడుతున్న మహిళను అంబులెన్స్ లో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ లోనే ఆమె ప్రసవించింది. మూడవ కాన్పులో పండంటి మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఈఎంటి సాయి కుమార్, పైలట్ దయానంద్ అంబులెన్స్ లోనే సదరు మహిళలకు పురుడు పోసారు. మాతా శిశువు ఇద్దరు క్షేమంగానే ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

## పోషకాహారం, విద్య, ఆరోగ్యానికి

# నిలయాలు అంగన్వాడి కేంద్రాలు

**- అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలి**

**- 16వ డివిజన్ కార్పొరేటర్ మునగడప పద్మ**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) పోషకాహారం విద్య ఆరోగ్యం పట్ల అంగన్వాడి టీచర్లు ఆయాల శ్రమ వెల కట్టలేనిదని 16 వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ కొనియాడారు. గురువారం 16వ డివిజన్ నెహ్రూ బస్తీ సెంటర్లో జరిగిన పోషణ్ పక్వాడ్ లో భాగంగా ఈనెల తొమ్మిది నుండి ఏప్రిల్ 23 వరకు జరిగే కార్యక్రమంలో మాట్లాడుతూ పోషకాహారం తల్లి, పిల్లలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని మనం నెలకొల్పవచ్చు అన్నారు అలాగే కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారం చేసే ఈ రోజుల్లో అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లు పిల్లలను అంగన్వాడి సెంటర్లకు తీసుకెళ్లి వారికి పోషకాహారం, విద్య ,ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ఆరోగ్యకరమైన పిల్లలుగా తయారు చేస్తున్న వారి కృషి అమోఘమని ఆమె అన్నారు. అనంతరం సెంటర్లో చిన్నారులకు అన్న ప్రసన,అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలతో కూడిన పోషకాహార ప్రదర్శన నిర్వహించి పిల్లలను ఆకట్టుకున్నారు. తన కుమారుడికి అక్షరాభ్యాసం నిర్వహించుకున్న తీట్ల దివాకర్ అంగన్వాడి సెంటర్లలోని చిన్నారులకు పలక, బలపాలని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడీ టీచర్స్ సరోజ ,డి నీలవేణి, షహనాజ్ ,దేవి, రజిత ,ఆయాలు వెంకటలక్ష్మి ,కౌసల్య, కొమరమ్మ ,తల్లిదండ్రులు తీట్ల దివాకర్, కంచర్ల శ్రావణి ,సంతోషి, ఎస్ కే ఫైజా, జాన్ నవీన్ ,జి రుత్విక్ ,రవి, విస్సీ ,ప్రసన్న ,జి నాగలక్ష్మి , లీల, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో తప్పిన పెను ప్రమాదం...



**రేణిగుంట** తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలోని బిజీగా ఉండే బస్టాండ్ కూడలిలో గురువారం ఒక పెను ప్రమాదం తృటిలో తప్పింది. విద్యుత్ లైన్ మరమ్మత్తుల కోసం స్తంభం ఎక్కిన ఒక కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ ఊహించని విధంగా విద్యుత్ ఘాతానికి గురయ్యారు.మరమ్మత్తులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో, సదరు ఎలక్ట్రీషియన్ స్తంభం పైనే స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్తంభంపైనే ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న బాధితుడిని చూసి స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, సమయస్ఫూర్తితో వ్యవహరించిన స్థానిక ప్రజలు వెంటనే స్పందించి, బాధితుడిని సురక్షితంగా కిందకు దించారు. అనంతరం ఏమాత్రం ఆలస్యం చేయకుండా చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తు సకాలంలో వైద్యం అందడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.?ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ శాఖ పనులను ప్రైవేటు వ్యక్తులకు, కాంట్రాక్ట్ కార్మికులకు అప్పగించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వారు మండిపడుతున్నారు. మరమ్మత్తులు జరుగుతున్న సమయంలో సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు మరియు బాధితుడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# దళారులకు ధాన్యం అమ్మి మోసపోయి గోస పడొద్దు

**- మార్కెట్లో మొక్కజొన్న కొనుగోళ్ళు వేగవంతం చేయాలి**

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**




కోరుట్ల (తెలంగాణ వాణి) మార్కెట్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి మొక్కజొన్న సంచులను త్వరగా లోడింగ్ పూర్తి చేయా లని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీని యర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న పంటను విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన రూ.2400ల మద్దతు ధరలకు అమ్మి సొమ్ము చేసుకోవాలి కానీ దళారుల నమ్మి విక్రయించి మోసపోయి గోస పడొద్దన్నారు. కోరుట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్క్ పేడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి సందర్శించారు. రైతులతో మాట్లాడిన అనంతరం జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కోరుట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్క్ పేడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఇంకా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.మొక్కజొన్న సంచులను లోడింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న పంటను ప్రభుత్వం రూ.2400 ల మద్దతు ధరలకు అమ్ముకోవాలని దళారుల నమ్మి మోసపోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



కోరుట్ల (తెలంగాణ వాణి) మహిళలు, గర్భిణీలు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాలు ఉన్న సమతుల్య పౌష్టికాహారం అందిస్తే పరిపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ అన్నారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భీముని అంగన్వాడి కేంద్రంలో పోషక పక్వాడ కార్యక్రమశీలో ముఖ్యఅతిథి గా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, 0-6 ఏళ్ల పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై ఏర్పాటు చేసిన అవగాహన అవగాహన కల్పించారు. పోషణ పక్వడ అంగన్వాడి కేంద్రంలో పాలిచ్చే తల్లులకు శిశువుల పోషణ పై సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిపూర్ణ పోషకాహారం వల్ల కలిగే ఆరోగ్యం గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలను చైతన్య పరుస్తున్నమని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఎత్తు బరువు చూసి ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసుకుని సప్లిమెంటరీ పోషకాహార నిపుణులు అవగాహన కిషోర బాలికలకు రక్తహీనత పరీక్షలు జరుపి పోషకాహర ఆహారం అనుభవించడానికి పిల్లలు, గర్భిణీలు,బాలింతలు కౌమార దశ బాలికలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు.జంక్ ఫుడ్ తినకుండా ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకోవడం మంచిదని 3-6 ఏళ్ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని అభివృద్ధి మైలురాళ్లు వల్ల అవగాహన కల్పిస్తున్నామని అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన అక్షరాభ్యాసం బాలింత లకు, శ్రీమంతాలు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ల చేతుల మీదుగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఓ కాశిపాక మణెమ్మ, సూపర్ వైజర్ అలవాల భారతి,ఏఎన్ఎం పి.శిరీష, జి.అన్నపూర్ణ, ఆశా,అంగన్ వాడి టీచర్లు శీలం హిమగిరి, అన్నం లక్ష్మి,కే ప్రసన్న, వి. ప్రేమలత,సిహెచ్ అరుణ, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు ఓలేపు రమ, ఏడబ్ల్యూహెచ్ బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
The Voice of Telangana



# ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్‌లో రోగి మృతి

**- బంధువుల ఆందోళన**



**ఎల్బీనగర్:** కామినేని హాస్పిటల్ లో డాక్టర్లు నిర్లక్ష్యం వల్ల నరేష్ అనే వ్యక్తి మృతి చెందాడని బంధువుల ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంకు చెందిన నరేష్ (38) అనే వ్యక్తి నారాయణ కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తాడు. గుండెలో చిన్న నొప్పి ఉందని నడుచుకుంటూ హాస్పిటల్ కి వచ్చాడు. 8 లక్షలు ఖర్చు అవుతుందని హాస్పిటల్ యజమాన్యం చెప్పారు. 5 లక్షలు రూపాయలు ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకొని ఆపరేషన్ స్టార్ట్ చేశారు. తరువాత నరేష్ మృతి చెందాడు. జూనియర్ డాక్టర్లతో ఆపరేషన్ చేశారని బంధువుల ఆరోపణ. మాకు న్యాయం చేయాలంటూ కామినేని హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు.

## కాలడేరా ప్రభుత్వ పాఠశాలలో

# సౌకర్యాలు కల్పించాలి

**హైదరాబాద్** కలడేరా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌక ర్యాలు కల్గకుండా పాఠశాలోని మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు అన్నారు. పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో కలడేరా లోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి అక్కడ వసతులపై ఆరా తీశారు. పురాతన భవనంలో పాఠశాల నిర్వహణతో విద్యార్థులు.ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు గదులలో ఏడు తరగతు నిర్వహిస్తుండంతో విద్యార్థులు అవస్థలు పడుతు న్నారని తెలిపారు. ఇబ్బందులు కల్గకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. స్కూల్ సమీపంలోని రెండు బ్లాకులు కేటాయించి ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రవేశ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలోపౌర స్పందన వేదిక నేతలు మనిక్ రెడ్డి.సమద్.రహముతుల్లా.అబ్దుల్లా.లక్ష్మన్ రావు తదితరులు పాల్గొన్నారు

# కొనసాగుతున్న విద్యుత్ అర్టిసన్ల సమ్మె

**రంగారెడ్డి** రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అర్టిసన్ ల ఉద్యోగులు తమకు సమాన పనికి సమాన వేతనం కావాలంటూ ఆందోళన బాట పట్టారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిసన్ ఉద్యోగులు ఆరు ప్రధాన డిమాండ్లతో ఆందోళన బాట పట్టారు. గత 9 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు. ఆరు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం యాజమాన్యం తక్షణమే అమలు చేయాలంటూ 10 యూనియన్లు జాయింట్ యాక్షన్ కమిటీగా తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవిఏజెఏసి) గా ఏర్పడి ఆందోళన బాటపట్టారు. ఈరోజు కార్మికుల నిర్వహిస్తున్న ధర్నాకు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ మద్దతు పలికారు ఆర్టిజన్ ఉద్యోగులలో విద్యార్హతలను బట్టి ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అంటే ప్రస్తుతం ఉన్న ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్ ను అమలు చేయాలి. ఆన్ మాండ్ వర్కర్లను ఆర్టిజన్ లను విలీనం చేయాలి 2016 డిసెంబర్ కన్నా ముందు నుండి విద్యుత్ సంస్థలో పనిచేస్తూ నేటికి అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఆర్టీసన్ ఉద్యోగులుగా గుర్తించాలి. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలి. 2026 పి ఆర్ సి వేతన సవరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు.

# బోయిన్ పల్లిలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**సికింద్రాబాద్..** ప్రజలకు శాంతిభద్రతల పట్ల భరోసా కల్పించడమే లక్ష్యంగా నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్ తెలిపారు. బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అలీ కాంప్లెక్స్ తో పాటు పరిసర ప్రాంతాలలో 300 మంది పోలీసు సిబ్బందితో నిర్బంధ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ డైరీ ఫామ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల ఆక్సిటోసిన్ రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ ఇంట్లో హుక్కా తయారీ యంత్రంతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బోయిన్ పల్లి ప్రాంతంలో గంజాయి సరఫరా పై కూడా ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు గంజాయి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పోలీసులకు అన్నివేళలా ప్రజలు సహకరించాల్సిన బాధ్యత ఉంటుందని అన్నారు.

# లైసెన్సు లేకుండా బండి నడపవద్దు

**- రోడ్డు భద్రత గురించి విద్యార్థులకు అవగాహన....**
**- హెల్మెట్ తప్పనిసరి....**
**- అంజిరెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ కోదాడ.**



గురువారం నాడు కోదాడ పట్టణంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో కోదాడ పట్టణం ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పాల్గొని మాట్లాడినారు. తెలంగాణ రాష్ట్రం" ప్రజా పాలన ప్రణాళికా ప్రగతి "కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత పాటించవలసిన నియమ నిబంధనలను



తెలియజేసినారు. విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే, వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష పడుతుందని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దు, వాహనంపై నడిపే వారితో పాటు కూర్చున్న వారు కూడా హెల్మెట్ ని ధరించాలని , అతివేగంగా వాహనాలు నడపొద్దు ప్రాణాలను కోల్పోవద్దు అని విద్యార్థులకు తెలియజేప్పినారు. సెల్ ఫోనులో వాట్సప్ ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ లలో పరిచయం లేని వారి రీల్స్ చూడవద్దు, లింకులు తెరవొద్దు, విద్యా విషయ పరిజ్ఞానం కోసమే సెల్ ఫోన్ ఉపయోగించాలని, సైబర్ క్రైమ్ దూరంగా ఉండాలని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, తల్లిదండ్రులకు సంతోషాన్ని కీర్తి ప్రతిష్టలు తేవాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడాలని తెలిపినారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

**సూర్యాపేట** సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశం జరుగుతుండగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలల్ పవర్ ఎదుట మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మండలంలోని తాడ్వాయి గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు కేటాయించారు. అయితే తాడ్వాయి గ్రామానికి చెందిన సునీత పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే మరొకరికి కేటాయించారాని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి మహిళ ప్రయత్నించింది. పురుగుల మందు తాగడంతో హుటాహుటిన కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారుఏ. కాంగ్రెస్ నాయకులు రాజకీయ అండదండలతో సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

# ఆ డబ్బు ఇస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాం

**సత్యవేడు** ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బులు ఇప్పిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు సుమన్ అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ఖర్చు పెట్టి నియోజవర్గంలో గెలిచాం. ఆ డబ్బులు తిరిగి ఇస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని అన్నారు. ఒక ఎస్సీ నియోజకవర్గంలో అగ్రవర్ణాల వ్యక్తిని ఇన్చార్జ్ ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. సత్యవేడు సీఐ రోజు ఇసుక,గ్రావెల్ అక్రమ రవాణాను దగ్గరుండి చేయిఇస్తున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సత్యవేడు అమలు కావడం లేదు. మేము ఎన్నికలలో పెట్టినా ఖర్చును మాకు ఇవ్వాలి.. డబ్బులు పెట్టి కష్టపడి సీటు గెలిచామని అన్నారు. మేము ఖర్చు పెట్టిన డబ్బును మాకు తిరిగి ఇస్తే చాలు.. దళిత ఎమ్మెల్యేను వేధిస్తారా.. గౌరవం లేనప్పుడు పార్టీలో ఉండటం ఎందుకు..? నాన్నపై పార్టీలోని వారే కుట్రలు చేశారని సుమన్ ఆరోపించారు.

# కరీంనగర్ 12 వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో మహిళల బైక్ ర్యాలీ



**కరీంనగర్** కార్పొరేటర్ జయశ్రీ మాట్లాడుతూ మహిళలకు చట్ట సభల్లో 33%రిజర్వేషన్లు కల్పించే నారి శక్తి వందన్ చట్టంకు మద్దతుగా కరీంనగర్లో నారీశక్తి స్కూటీ ర్యాలీ లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలోసరస్వతి, శోభ, కొల్లూరి స్వరూప, నూనె కోమల, సింగిరెడ్డి సమత, బుజ్జా సృజన, రమణ, స్వరూప, వాసుదేవ కాలనీ నుండి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

## ఎండాకాలంలో భక్తుల కోసం

# రోడ్డుపై కూల్ పెయింట్



**బ్రహ్మంగారి మఠం** ఎండాకాలంలో బ్రహ్మంగారి దర్శనార్థం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే ఈ యాత్రికులకు రోడ్డుపై కాళ్లు కాలుతాయని ఉద్దేశంతో పాలకొండ ఉండేందుకు రోడ్డుపై మఠం నిర్వాహకులు కూల్ పెయింట్ వేయడంతో ఇటు స్థానిక ప్రజలు అటు భక్తాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితేజగద్గురు శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠము నందు మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారి ఆదేశాల మేరకు ఈ వేసవి కాలంలో స్వామివారి మఠం దర్శనానికి వచ్చే భక్తులకు కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేయాలని మఠాధిపతుల వారు మేనేజర్ ఎన్ ఈశ్వర చారి గారిని ఆదేశించడం జరిగినది. మఠాధిపతుల ఆజ్ఞ మేరకు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి గారు భక్తుల సౌకర్యార్థం మఠం బస్టాండ్ నుండి సింహద్వారం వరకు మరియు వరుణ్ స్కూల్ నుండి సింహద్వారం వరకు, మఠం ప్రాంగణంలో కూడా భక్తుల సౌకర్యార్థం కూల్ పెయింట్ వేయడం జరిగినది. మఠాధిపతులు భవిష్యత్తులో మరిన్ని భక్తుల సౌకర్యాలు కలిగే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని భక్తులు మరియు పుర ప్రజలు కోరుకుంటున్నారు

## సిరిసిల్లలో జిల్లా కేంద్రంలో

# ఇసుక బక సురులు

**- తహసీల్దార్ మహేష్ ను చంపేందుకు యత్నం**
**- అక్రమ దందాను అడ్డుకున్నందుకు ట్రాక్టర్‌తో తొక్కించేందుకు ప్లాన్..**
**- తృటిలో తప్పిన మృత్యు ప్రమాదం......**



**రాజన్న సిరిసిల్ల** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక బక సురులు బరితెగించారు జిల్లాలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా, ఇప్పుడు ఏకంగా బాధ్యతయుతమైన అధికారి ప్రాణాలకే ఎసరు పెట్టింది.అక్రమ ఇసుక రవాణాకు అడ్డువస్తే ఎవరినైనా మట్టుబెడతామన్నట్టుగా ప్రవర్తిస్తూ సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ పైనే హత్యాయత్నానికి ఒడిగట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లిన ఎమ్మార్వో మహేష్‌కు అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్ ఎదురైంది. తన విధుల ప్రకారం ట్రాక్టర్‌ను ఆపాలని ఆయన డ్రైవర్‌ను హెచ్చరించారు అధికారులను చూడగానే భయపడాల్సిన డ్రైవర్ శివాజీ, రాక్షసంగా ప్రవర్తించాడు. ట్రాక్టర్‌ను ఆపకపోగా, నేరుగా ఎమ్మార్వో మహేష్ పైకి పోనిచ్చి ఆయనను తొక్కించి చంపేందుకు ప్రయత్నించాడు సమయస్ఫూర్తితో మహేష్ పక్కకు తప్పుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.జిల్లా కేంద్రంలోనే ఒక ఉన్నతాధికారిపై ఈ స్థాయిలో దాడి జరగడం కలకలం రేపుతోంది. డ్రైవర్ శివాజీ చర్య వెనుక ఇసుక మాఫియా పెద్దల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ కల్పించాల్సిన అధికార యంత్రాంగంపైనే దాడులు జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మార్వో మహేష్ వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధ్యుడైన డ్రైవర్ శివాజీపై సిరిసిల్ల టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతులు అందుతున్నాయి.

# 20న సీఎం చంద్రబాబు జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో రక్తదాన శిబిరం సహకరిస్తామన్న మంత్రి ఫరూక్




**నంద్యాల .** ఈ నెల 20వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేయబోయే రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల వారికి అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాష విజ్ఞప్తి చేసారు. సేవా కార్యక్రమాల్లో ముందుండే తెలుగుదేశం పార్టీ, టిడిపి అధినేత, జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా తప్పక రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. టిడిపి వార్డు ఇంచార్జీల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రక్తదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. టిడిపి రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి టిడిపి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ డిఎఫ్ఓ అబ్దుల్ సమీ పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతల నుండి జాగ్రత్తలు వహిస్తూ విధులు నిర్వర్తించాలి

**- జిల్లా ఎస్పీ మహేష్ బి . గితే**



**రాజన్న సిరిసిల్ల** అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.ఈ సందర్భంగా గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న అధికారులకు , సిబ్బందికి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వడగాలుల నుండి రక్షణకు కూలింగ్ గ్లాసెస్ అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...తీవ్ర ఎండల సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.ట్రాఫిక్ సిబ్బంది,బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ మరియు వివిధ బందోబస్తు విధులలో పాల్గొనే వారు నీరు, గ్లూకోజ్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు ఎండల ప్రభావం తగ్గించే విధంగా తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని,తగిన జాగ్రత్తలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగ వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమలపై, హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై, మైనర్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారుఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్టికోట గ్రామంలో

# రెండు గడ్డివాములు దగ్ధం...

**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలం పెట్టి కోట గ్రామంలో గురువారం నాడు గొంగటి



సూర్యనారాయణ రెడ్డి అనే రైతుకు చెందిన రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతి ఐ పూర్తిగా కాలిపోయాయి. ముళ్ళ కంపకు నిప్పు పెట్టి కాల్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అగ్ని రవ్వలు గడ్డివాములపై పడటంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే రెండు గడ్డివాములు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. గడ్డివాముల విలువ దాదాపు 50 వేల రూపాయలు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

# భద్రతా నియమాలను పాటించండి..

**- సిద్దిపేట పోలీసుల వినూత్న కార్యక్రమం**



**సిద్దిపేట** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా సిద్దిపేట జిల్లా పోలీస్ యంత్రాంగం 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని వాహన షోరూమ్, పెట్రోల్ బంక్ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని షోరూమ్‌ల,బంకుల యజమానుల సహకారంతో, ప్రతి షోరూమ్ ప్రాంగణంలో మరియు పెట్రోల్ బంక్ ఆవరణలో రోడ్డు భద్రతా నియమాలను వివరించే బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త వాహనం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి, చోదకులకు రోడ్డు నిబంధనలపై ప్రాథమిక అవగాహన కల్పించడం ఈ చర్య వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలన్నదే మా ఆకాంక్ష. షోరూమ్ స్టేక్ హోల్డర్స్ అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అభినందనీయం. వాహనదారులు కేవలం నిబంధనల కోసమే కాకుండా, తమ కుటుంబ సభ్యుల కోసం రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు.ప్రజలు పోలీసులకు సహకరించి, రోడ్డు భద్రతను ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరుతున్నాము మీ భద్రతే మా ప్రాధాన్యత.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
The Voice of Telangana
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026



## నిఖిల్ 'స్వయంభు' నుంచి 'రారా ధీవరా' సాంగ్ రిలీజ్

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రం 'స్వయంభు'. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా తొలి పాటను విడుదల చేశారు. 'రారా ధీవరా' పేరుతో గురువారం విడుదలైన ఈ సింగిల్, సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. బ్లాక్‌బస్టర్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భక్తి, పరాక్రమం కలగలిపిన థీమ్‌తో ఈ పాటను స్వరపరిచారు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యానికి, సంతోష్ వెంకీ తన గాత్రంతో ప్రాణం పోశారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంతో మొదలయ్యే ఈ గీతం, కథానాయకుడు ఒక యోధుడిగా పరివర్తన చెందే ఘట్టాన్ని పవర్‌ఫుల్‌గా ఆవిష్కరించింది. ఈ పాటను 500 మందికి పైగా డ్యాన్సర్లతో అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించారు. నిఖిల్, నభా నటేష్‌లపై చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పాట విడుదల సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ, "'రారా ధీవరా' పాట నా పాత్రలోని స్ఫూర్తిని, దాని తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పాట కోసం పడిన కష్టం, ఎమోషన్ చాలా ప్రత్యేకం" అని తెలిపారు. సంగీత దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ, "పాత్రను, కథను ఉన్నత స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ సౌండ్‌ను ఈ పాట ద్వారా తీసుకురావాలనుకున్నాం" అని వివరించారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నభా నటేష్, సంయుక్త హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ పాట విడుదలైంది.

## మోహన్ బాబును ఆటపట్టించిన చిన్నారి అవ్రామ్



వెండితెరపై గంభీరమైన స్వరంతో, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే 'కలెక్షన్ కింగ్' మంచు మోహన్ బాబుకు తన మనవడి రూపంలో ఒక క్యూట్ సవాల్ ఎదురైంది. మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ భక్త మంచు తన తాతయ్యనే అనుకరిస్తూ అల్లరి చేసిన వీడియో ఇప్పుడు నెటిజన్లను కడుపుబ్బ నవ్విస్తోంది. సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న ఈ వీడియోలో, తాత-మనవళ్ల మధ్య సాగిన సరదా సంభాషణ అందరినీ ఆకట్టుకుంటోంది. సాధారణంగా మోహన్ బాబు ఎదురుపడితేనే ఇండస్ట్రీలో ఎవరైనా ఎంతో వినయంగా ఉంటారు, కానీ చిన్నారి అవ్రామ్ మాత్రం అస్సలు తగ్గలేదు. తాతయ్య సైలెంట్‌గా ఉండమని వారించినా, ఏమాత్రం బెదరకుండా తనదైన శైలిలో 'ఏంటీ బాబూ..' అంటూ ఎదురు ప్రశ్నించి మోహన్ బాబునే ఆశ్చర్యపరిచాడు. మనవడి ముద్దు ముద్దు మాటలకు ఆ గంభీరమైన నటుడు కూడా మెత్తబడిపోయి, ముసిముసి నవ్వులు చిందిస్తూ ఉండిపోయారు. చివరకు ఎంతో స్టైల్‌గా 'బై బాబూ' అంటూ అవ్రామ్ అక్కడి నుంచి వెళ్లిన తీరు చూస్తుంటే, డైలాగ్ కింగ్ ముందే డైలాగులు పేల్చే వారసుడు వచ్చేసాడని అభిమానులు మురిసిపోతున్నారు. ఎంతటి కఠినమైన క్రమశిక్షణ గల వారైనా మనవడి అల్లరి ముందు లొంగిపోవాల్సిందేనని ఈ వీడియో నిరూపిస్తోంది.



### తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారంటూ

## తమన్నా పిటిషన్.. కొట్టివేసిన హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై ప్రముఖ సినీ నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది.

దీని ప్రకారం 2009 అక్టోబర్ వరకు తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఉంది. అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010-2011 మధ్య ఈ సంస్థ తన ఫొటోలను అనుమతి లేకపోయినప్పటికీ ఉపయోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకు గాను తనకు రూ.1 కోటి పరిహారం నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇందుకు సంబంధించి సాక్ష్యాలు చూపలేదంటూ కోర్టు తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది.

## సమ్మర్ వెకేషన్‌లా అనిపిస్తుంది

నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్న చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. ముని దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సినిమా మంచి సమ్మర్ వెకేషన్‌లా అనిపిస్తుందని, తిమ్మరాజుపల్లి అనే ఊరిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో వినోదం, థ్రిల్లింగ్ అంశాలతో మెప్పిస్తుందని, చిన్న బడ్జెట్‌లో ఇంత క్వాలిటీగా సినిమా చేయొచ్చా అని అందరూ ఆశ్చర్యపోతారని కిరణ్ అబ్బవరం అన్నారు. చిన్న చిత్రాల్లో ఈ సినిమా ఓ బెంచ్ మార్క్ క్రియేట్ చేయబోతున్నదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యంలో ఆహ్లాదభరిత కథాంశంతో అందరికి నచ్చే చిత్రమిదని దర్శకుడు వి.మునిరాజు అన్నారు. కొత్తవారైనా నటీనటులందరూ అద్భుతమైన పర్ఫార్మెన్స్ కనబరిచారని ఈటీవీ విన్ బిజినెస్‌హెడ్ సాయికృష్ణ ప్రశంసించారు.



# 'యూత్' మూవీ రివ్యూ!



తమిళంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ సినిమానే 'యూత్'. కెన్ కరుణన్ .. అనిష్మా అనిల్ కుమార్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి కెన్ కరుణాస్ దర్శకత్వం వహించాడు. మార్చి 19వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ రోజు నుంచే 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కి వచ్చింది. 'యూత్'ను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ సినిమా, పూర్తిస్థాయిలో వాళ్లను అలరించిందా లేదా అనేది చూద్దాం. ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరముడు) సరోజ ( దేవదర్శిని) భార్యాభర్తలు. వారి సంతానమే ప్రవీణ్ (కరుణాస్). ఉన్నికృష్ణన్ ఒక బేకరీ నడుపుతూ, మిడిల్ క్లాస్ ఫ్యామిలీని నెట్టుకొస్తుంటాడు. భార్యాభర్తలు కష్టపడుతూ, కొడుకును కార్పొరేట్ జూనియర్ కాలేజ్ లో చదివిస్తుంటారు. తమ కొడుకు బాగా చదువుకుని తమని ఉద్ధరిస్తాడనే బలమైన నమ్మకంతో సరోజ ఉంటుంది. అతను మాత్రం లవ్ అంటూ కాలేజ్ లో అమ్మాయిల వెంట తిరుగుతుంటాడు. అదే కాలేజ్ లో చదువుతున్న ప్రేషిక (మీనాక్షి దినేశ్)ను ప్రవీణ్ ప్రేమిస్తుంటాడు. ఆమె కూడా అతనిని ఆరాధిస్తూ ఉంటుంది. ఒకసారి ఆమె అత్యవసరంగా తన ఊరు వెళ్లవలసి వస్తుంది. అక్కడి నుంచి ఆమె తిరిగి వచ్చేలోగా, ప్రవీణ్ ను సోనాల్ (ప్రియాన్షు యాదవ్) ఆకట్టుకుంటుంది. సోనాల్ తో ప్రవీణ్ చనువుగా ఉండటాన్ని ప్రేషిక గమనిస్తుంది. తాను ఊరెళ్లి వచ్చేలోగా ప్రవీణ్ మారిపోయాడని ఆమె భావిస్తుంది. ఈ ఇద్దరి ప్రేమతో ప్రవీణ్ చదువును పూర్తిగా నిర్లక్ష్యం చేస్తాడు. ఇక గంగవల్లి (అనిష్మా అరుణ్ కుమార్) కూడా అదే కాలేజ్ లో చదువుతూ ఉంటుంది. ఒక చిన్నపాటి గొడవతోనే వాళ్లిద్దరి పరిచయం జరుగుతుంది. అప్పటి నుంచి ఆమె అతనితో స్నేహంగా ఉండటం మొదలుపెడుతుంది. ఆమె కూడా తనని ప్రేమిస్తుందనే ప్రవీణ్ భావిస్తాడు. ఒక వైపున ప్రేషిక ..ఒక వైపున సోనాల్ .. మరొక వైపున గంగవల్లి. ఈ ముగ్గురిలో ఎవరి ప్రేమ నిజమైంది? చివరికి ఎవరితో కలిసి ప్రయాణించాలని ప్రవీణ్ నిర్ణయించుకుంటాడు? చదువు విషయంలో తన పేరెంట్స్ కోరికను అతను నెరవేర్చగలుగుతాడా? అనేది కథ. మిడిల్ క్లాస్ పేరెంట్స్ ఆశలు .. కలలు దాదాపుగా ఒకేలా ఉంటాయి. తమ పిల్లలు పెద్ద చదువులు చదవాలనీ .. పెద్ద ఉద్యోగాలు చేయాలని భావిస్తారు. అందుకోసం ఎన్ని కష్టాలైనా భరిస్తుంటారు. కానీ టీనేజ్ లోకి .. కాలేజ్ క్యాంపస్ లోకి అడుగుపెట్టిన స్టూడెంట్స్ ఆలోచనలు వేరుగా ఉంటాయి. అప్పటివరకూ అందని స్వేచ్ఛ తమకి లభించిన ఆనందంలో ఉంటారు. ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతిని పొందుతుంటారు. అందం .. ఆకర్షణ .. అనే విషయాల పట్ల వాళ్లు ఆసక్తిని చూపుతుంటారు. అప్పటివరకూ ఉన్న అడ్డుగోడలు తొలగిపోయినట్టుగా భావిస్తూ, అమ్మాయిలతో స్నేహానికి .. ఆ స్నేహాన్ని ప్రేమగా మార్చడానికి ప్రయత్నిస్తుంటారు. తాము చదువుకోవడానికి వచ్చామని గానీ, తమపైనే తమ పేరెంట్స్ ఆశలు పెట్టుకున్నారనే ఆలోచన గాని వారికి ఉండవు. ప్రేమ అనే రెండు అక్షరాల చుట్టూనే వాళ్లు ప్రదక్షిణ చేస్తుంటారు. అలా చదువును గాలికొదిలేసి లవ్వంటూ తిరిగిన ఒక యువకుడి చుట్టూ దర్శకుడు అల్లుకున్న కథనే ఈ సినిమా. స్నేహం .. ఆకర్షణ .. ప్రేమ ఈ మూడు అంశాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. కథలో భాగంగా .. అంచలంచెలుగా ఈ విషయాన్ని అనుభవంలోకి వచ్చేలా చేసిన తీరు మెప్పిస్తుంది. ఈ మూడింటి మధ్య ఉన్న తేడాను స్పష్టంగా చెప్పడానికి చేసిన ప్రయత్నం ఆకట్టుకుంటుంది. టీనేజ్ లో .. కొత్తగా కాలేజ్ క్యాంపస్ లోకి అడుగుపెట్టిన తరువాత, కొంతమంది స్నేహాన్ని ప్రేమ అనుకుంటారు .. మరికొంతమంది ఆకర్షణను ప్రేమ అనుకుంటారు. మరి అసలైన ప్రేమ ఎలా ఉంటుంది? అనే ఆలోచనను రేకెత్తిస్తూ ఈ కథను ఆవిష్కరించిన విధానం మనసుకు పట్టుకుంటుంది. నిజమైన ప్రేమలో స్వార్థం ఉండదు .. అలాంటి ప్రేమను తల్లిదండ్రులు మాత్రమే పంచగలరు అనే సందేశాన్ని ఇచ్చిన తీరు మనసును కదిలిస్తుంది. ఈ సినిమా మొదలైన దగ్గర నుంచి చివరివరకూ ఎక్కడా బోర్ అనిపించదు. ఎవరి కాలేజ్ లైఫ్ ను వాళ్లకి గుర్తుచేస్తూ ఈ కథ కొనసాగుతుంది. ప్రేమ .. అల్లరి .. అలకలు .. గొడవలు .. మందలింపులు .. ఎమోషన్స్ ఇలా అన్నిటినీ కలుపుకుంటూ వెళుతుంది. అందువలన ఆడియన్స్ కి వెంటనే కనెక్ట్ అవుతుంది. ఆర్టిస్టులంతా కూడా ఎవరి పాత్రలో వాళ్లు జీవించారు. విక్కీ ఫొటోగ్రఫీ .. జీవీ ప్రకాశ్ కుమార్ నేపథ్య సంగీతం .. నాష్ ఎడిటింగ్ కథకు మరింత బలాన్ని అందిస్తాయి. 'నలుగురిలో విలువను పెంచేది .. మర్యాదానిచ్చేది .. జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. లవ్వంటూ సమయాన్ని వృథా చేసుకుని .. భవిష్యత్తును పాడుచేసుకోవద్దు. నిజమైన ప్రేమను పంచేది పేరెంట్స్ మాత్రమే. వాళ్ల కలను నిజం చేయడానికి కష్టపడండి' అనే సందేశంతో కూడిన సినిమా ఇది. ఎలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలు లేని ఈ సినిమాను ఫ్యామిలీతో కలిసి చూడొచ్చు.

# తమిళంలో బంపరాఫర్



'కాంతార-2' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపును దక్కించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఈ సొగసరి భారీ ఆఫర్లతో బిజీగా ఉంది. ఇప్పటికే తెలుగులో ఎన్టీఆర్ 'డ్రాగన్', కన్నడంలో యశ్ 'టాక్సిక్'లో కథానాయికగా నటిస్తున్న ఆమె తాజాగా తమిళంలో అగ్ర హీరో ధనుష్ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ధనుష్ తన 57వ చిత్రాన్ని తమిళరసన పద్యముత్తు దర్శకత్వంలో చేయబోతున్నారు. ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేశారు. తమిళంలో ఏస్, మదరాసి చిత్రాలు ఆమెను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో కోలీవుడ్‌లో మంచి బ్రేక్‌నిచ్చే సినిమా కోసం ఎదురుచూస్తున్నదీ భామ. తాజా ఆఫర్‌తో తమిళంలో రుక్మిణి కెరీర్ మలుపు తిరగడం ఖాయమంటున్నారు.

## వరుణ్‌తేజ్‌కు శస్త్రచికిత్స

హీరో వరుణ్‌తేజ్ తాజా చిత్రం 'బరి' సినిమా ఇటీవలే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణలో భాగంగా వరుణ్‌తేజ్ వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి తీవ్రగాయమైంది. దాంతో ఆయనకు శస్త్రచికిత్సను నిర్వహించారు. ఈ విషయాన్ని ఆయన సోదరి, చిత్ర నిర్మాత నిహారిక కొణిదెల తన సోషల్‌మీడియా ద్వారా తెలియజేశారు. 'వాలీబాల్ గేమ్ ప్రాక్టీస్ సందర్భంగా అన్నయ్య గాయపడ్డారు. ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం అన్నయ్య డాక్టర్ల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారు. త్వరలో ఆయన పూర్తిగా కోలుకుంటారని భావిస్తున్నాం. ఈ సమయంలో మాకు అండగా నిలిచి ప్రేమాభిమానాలు చూపించిన వారందరికి ధన్యవాదాలు' అని నిహారిక పేర్కొన్నారు. వరుణ్‌తేజ్‌కు శస్త్రచికిత్స కారణంగా షూటింగ్ కొన్ని వారాల పాటు వాయిదా పడనున్నట్లు తెలిసింది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న 'బరి' చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహిస్తున్నారు.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com